ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల

జిల్లా వార్తలు 5

శుక్రవారం 24 జనవరి 2025

ఘనంగా లోకేశ్ బర్త్‌డే



కోవెలకుంట్లలో మంత్రి బీసీకి కేక్ తినిపిస్తున్న మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గడ్డం నాగేశ్వర్‌రెడ్డి

కోవెలకుంట్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో గురువారం నారా లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ వైసీపీ హయాంలో దెబ్బతిన్న రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు నారా లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు. యువగళం పాదయాత్రతో ప్రజల కష్టాలు ఆయన నేరుగా తెలుసుకున్నారన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ముందుకెళ్తున్నారన్నారు. అనంతరం టీడీపీ శ్రేణులతో మంత్రి సమావేశమయ్యారు.

ప్రజల్లో విశ్వాసం నింపిన యువగళం

నారా లోకేశ్ జన్మదిన వేడుకల్లో మంత్రి ఫరూక్



నంద్యాలలో కేక్ కట్ చేసి వేడుకలు చేస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కష్టకాలంలో ఉన్నపుడు అండగా నిలిచి యువగళంతో ప్రజల్లో నారా లోకేశ్ విశ్వాసాన్ని నింపారని రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి మంత్రి ఫరూక్ హాజరై కేక్ కట్‌చేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో రోగుల సహాయకులకు మంత్రి ఫరూక్ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ పార్టీలో, ప్రజల్లో నారా లోకేశ్ సమర్థుడైన నాయకుడిగా పేరుతెచ్చుకున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన విద్యావ్యవస్థను గాడిలో పెడుతున్నారన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకురావడంలో లోకేశ్ కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువనాయకుడు ఎన్ఎండి ఫయాజ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నష్టపరిహారం పెంపును పరిశీలిస్తాం : కలెక్టర్



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, జేసీ

నంద్యాల కల్చరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 340-సి ప్యాకేజీ కింద పెండింగ్‌లో ఉన్న నష్టపరిహారం పెంపును పరిశీలిస్తామని కలెక్టర్ రాజకుమారి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ క్లెయిమ్స్ నష్టపరిహార పెంపు విషయంపై జేసీ విష్ణుచరణ్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ 340-సి ప్యాకేజీ కింద జూపాడుబంగ్లా మండలం మండ్లెం గ్రామానికి సంబంధించి 20.26 ఎకరాల్లో 49 మంది భూసేకరణ బాధితులకు సంబంధించిన క్లెయిమ్స్‌లకు సంబంధించిన నష్టపరిహార పెంపు అంశంపై పరిశీలిస్తామన్నారు. జాతీయ రహదారులు, భూసేకరణ అధికారులు, సంబంధిత రైతులు వివరించిన అంశాలను పరిగణలోకి తీసుకుని నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ వెల్లడించారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించి జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన, భూములకు రిజిస్ట్రేషన్, మార్కెట్ ధరలను తీసుకొని ధరలను నిర్ణయిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎన్‌హెచ్ తహసీల్దార్లు ఆల్ఫ్రెడ్, సువర్ణ, ఎన్‌హెచ్ అధికారులు అధికారులు, బాధిత రైతులు పాల్గొన్నారు.



ఎటూ తేలని నీరు - చెట్టు లెక్కలు

రాష్ట్ర విభజన తరువాత అప్పటి టీడీపీ ప్రభుత్వం నీరు-చెట్టు పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకంలో అక్రమాలు జరిగాయని విజిలెన్స్ విచారణ పేరిట బిల్లులు ఆపేసింది. న్యాయస్థానాన్ని ఆశ్రయించిన కాంట్రాక్టర్లకు కొంత వరకు బిల్లులు చెల్లించింది. మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక నీరు-చెట్టు బిల్లులపై దృష్టి సారించింది. రాష్ట్ర వ్యాప్తంగా రెండు విడుతల్లో రూ.584 కోట్లు విడుదల చేస్తే.. ఉమ్మడి కర్నూలు జిల్లాకు దాదాపుగా రూ.90 కోట్లు ఇచ్చారు. ఈ బిల్లులు క్లియర్ చేయాలనే కృత నిశ్చయంతో ఉన్న ప్రభుత్వం ఈ నెల 31లోగా లెక్కలు తేల్చాలని, పెండింగ్ బిల్లులు అప్‌లోడ్ చేయాలని, ఆ తరువాత వచ్చే బిల్లులు పరిగణలోకి తీసుకోమని ప్రభుత్వం తేల్చేసింది.

- కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.90 కోట్ల చెల్లింపు
- కోర్టుకు వెళ్లిన వారికే బిల్లులు
- 31లోగా లెక్కలు తేల్చి డిక్లరేషన్ ఇవ్వాలని ఆదేశం
- ఆ తరువాత వచ్చే బిల్లులు పరిగణలోకి తీసుకోరు
- బిల్లులు అప్‌లోడ్ చేసేందుకు కుస్తీ పడుతున్న ఇంజనీర్లు
- కర్నూలు జిల్లాలో అక్రమాలపై విజిలెన్స్ విచారణ

కర్నూలు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ పరిధిలోకి తుంగభద్ర దిగువ కాలువ (టీబీపీ ఎల్లెల్సీ) డివిజన్, కేసీ కెనాల్ నంద్యాల డివిజన్, ప్రొటెక్షన్ వర్క్ డివిజన్, మైనర్ ఇరిగేషన్ (ఎంఐ) కర్నూలు, నంద్యాల డివిజన్లు పరిధిలో గత టీడీపీ ప్రభుత్వంలో నీరు-చెట్టు పనులు చేశారు. భూగర్భ జలాలు పెంపు, నీటి వనరుల సంరక్షణ లక్ష్యంగా 2014-15 నుంచి 2018-19 వరకు కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో ఆయా డివిజన్లలో దాదాపు రూ.1,421.31 కోట్లు విలువైన 14,345 పనులను మంజూరు చేసి పరిపాలన, సాంకేతిక అనుమతులు ఇచ్చారు. చెక్ డ్యాంలు నిర్మాణం, చెరువులు, వంకలు, వాగులు, కాలువల్లో పూడికతీత (డీసిల్టింగ్), జంగిల్ క్లియరెన్స్ వంటి పనులు చేపట్టారు. దాదారు రూ.580 కోట్లు ఖర్చు చేశారు. 2019 మేలో జగన్ సారథ్యంలో వైసీపీ ప్రభుత్వం వచ్చాక పనులు ఆపేయడంతో పాటు ఈ పనుల్లో భారీగా అవినీతి అక్రమాలు జరిగాయని, విజిలెన్స్ విచారణ పేరుతో బిల్లులు చెల్లింపులు నిలిపివేశారు. బిల్లులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయకుండా హెడ్ ఆఫ్ అకౌంట్ క్లోజ్ చేసింది. ఇప్పటి వరకు సుమారుగా రూ.280 కోట్లు బిల్లులు చెల్లించినట్లు తెలుస్తోంది. అందులో కూటమి ప్రభుత్వం వచ్చాకే రూ.90 కోట్లు చెల్లించారు. కోర్టుకు వెళ్లిన వారికే బిల్లులు ఇచ్చారు. ముప్పాతి శాతం టీడీపీ సానుభూతిపరులైన కాంట్రాక్టర్లకు బిల్లులు రాక ఆర్థికంగా నష్టపోయారు. పలువురు కాంట్రాక్టర్లు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడులను కలసి తమ ఆవేదన వ్యక్తం చేశారు.




జలమండలి కార్యాలయం

మిగతా 6వ పేజీలో



మిథ్యగా ఇంటర్ విద్య

- అరకొర సౌకర్యాల మధ్య చదువులు
- ఇన్‌చార్జి అధికారులతో కుంటుపడిన పాలన
- కాంట్రాక్ట్ అధ్యాపకులతోనే బోధన
- ఇప్పటికీ అందని ఉర్దూ మీడియం పాఠ్యపుస్తకాలు
- దగ్గర పడుతున్న పరీక్షలు
- ఆందోళనలో విద్యార్థులు



అరకొర వసతుల మధ్య ఈ ఏడాది ఇంటర్ విద్య ముగుస్తోంది. కాంట్రాక్ట్ అధ్యాపకులు, ఉర్దూ మీడియం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందకపోవడంతో తూతూ మంత్రంగా చదువు సాగిపోయింది. ఫిబ్రవరి ఒకటో తేదీన ఎథిక్స్ మానవీయ విలువలు 3వ తేదీన పర్యావరణ విద్య పరీక్షతోపాటు ఇంటర్ సైన్స్ ప్రాక్టికల్ పరీక్షలు ఇదే నెల 5వ తేదీన ఒకేషనల్ కోర్సులకు, 10వ తేది నుంచి జనరల్ కోర్సులకు పరీక్షలు జరగనున్నాయి. మార్చి ఒకటో తేదీన ఇంటర్ ప్రథమ సంవత్సరం, 2వ తేదీన ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు ప్రారంభమవుతాయి. జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్ రెసిడెన్షియల్, ప్రైవేటు జూనియర్ కళాశాలలు 165 ఉన్నాయి. వీటిలో 46,335 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో 26 ప్రభుత్వ కళాశాలలు, నాలుగు ఎయిడెడ్ కాగా, మిగతావి రెసిడెన్షియల్ ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి.

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం పూర్తి కావస్తున్నా ఇంటర్మీడియట్‌లో ఉర్దూ మీడియం గ్రూపు విద్యార్థులకు గత ఆరేడు సంవత్సరాల నుంచి పాఠ్యపుస్తకాలను సరఫరా చేయలేదు. ఎమ్మిగనూరు, కర్నూలు కేవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, కర్నూలు ప్రభుత్వ మైనార్టీ జూనియర్ కళాశాలలో దాదాపు వెయ్యి మంది విద్యార్థులు ఉర్దూ మీడియం చదువుతున్నారు. ఉర్దూ మీడియం బోధించే అధ్యాపకులు ఇచ్చిన నోట్స్‌పైనే ప్రిపరేషన్ అయి పరీక్షలు రాయాల్సి ఉంది. పాఠ్యపుస్తకాలు లేకపోవడంతో ఉర్దూ మీడియం విద్యార్థులు పరీక్షలు ఎలా రాయాలోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం ఉర్దూ మీడియం విద్యార్థులకు శాపంగా మారింది.

నియామకాలను మరిచారు..

గత కొన్ని సంవత్సరాల కిందట కర్నూలు జిల్లాకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ప్రభుత్వం మంజూరు చేసింది. బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులను భర్తీ చేయడాన్ని విస్మరించడంతో పేద విద్యార్థులకు సరైన విద్య అందడం లేదు. జిల్లాలోని ఎమ్మిగనూరు, కర్నూలుకు మైనార్టీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మంజూరయ్యాయి. వీటిల్లో ప్రిన్సిపాల్ పోస్టు, లెక్చరర్స్, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించలేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేసే సీనియర్ అధ్యాపకులకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్స్ బాధ్యతలను అప్పగించారు. కాంట్రాక్ట్ విధానం ద్వారా బోధన, బోధనేతర సిబ్బందిని నియమించారు.

ఎయిడెడ్ కళాశాలలు అధ్వానం



జిల్లాలో ఎయిడెడ్ కళాశాలల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఈ కళాశాలలో బోధన, బోధనేతర సిబ్బంది కొరత వేధిస్తోంది. జిల్లాలో నాలుగు ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో 1500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఖాళీ ఏర్పడిన పోస్టుల స్థానాల్లో కొత్త నియామకాలు చేపట్టకపోవడంతో బోధన, బోధనేతర సిబ్బంది లేక ఖాళీ అవుతున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్ట్ అధ్యాపకులను నియమిస్తోంది. అయితే ఎయిడెడ్ కళాశాలల్లో కాంట్రాక్ట్ అధ్యాపకులను నియమించకపోవడంతో అడ్మిషన్ల సంఖ్య లేక కళాశాలలు వెలవెలపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎయిడెడ్ కళాశాలలపై సవతి తల్లి ప్రేమ చూపుతోందనే విమర్శలు ఉన్నాయి. ఉన్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదు.

కాంట్రాక్ట్ అధ్యాపకులే గతి

జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో అధ్యాపకుల కొరత వేధిస్తోంది. జిల్లాలో ప్రభుత్వం మంజూరు చేసిన పోస్టుల్లో 70 శాతం ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయడంలో ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. జిల్లాలో రెగ్యులర్ లెక్చరర్స్ 190 మంది మాత్రమే ఉన్నారు. దీంతో కాంట్రాక్ట్ అధ్యాపకులు, రీడిప్లాయిడ్ లెక్చరర్స్, మినిమమ్ టైం స్కేల్ అధ్యాపకులు, గెస్ట్ ఫ్యాకల్టీతో ఇంటర్ విద్యను నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రతి ఏడాది లెక్చరర్ ఖాళీలు పెరుగుతూనే ఉన్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదు. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు అడ్మిషన్లు లేక మూతకు సిద్ధంగా ఉన్నాయి. మరికొన్ని కళాశాలల్లో కొన్ని గ్రూపులను ఎత్తివేస్తున్నారు.

ఇన్‌చార్జిల పాలనలో ఇంటర్ విద్య

కర్నూలు జిల్లాలో గత 10 సంవత్సరాల నుంచి డీవీఈవో, ఆర్ఐవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇన్‌చార్జి పాలనతో నెట్టుకొస్తున్నాయి. నందికొట్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న వై. పరమేశ్వరరెడ్డికి డీవీఈవోగాను, ఓర్వకల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు ఆర్ఐఓ అధికారిగా ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. ఈ కళాశాలపై పర్యవేక్షణ కరువైంది. దీంతో ఇంటర్ విద్యపరిపాలన గాడి తప్పింది. వీరు రెండు పదవులకు న్యాయం చేయలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ బోర్డు పర్యవేక్షణాధికారులను నియమించడంలో తీవ్ర జాప్యం చేస్తోందనే వాదనలు వినిపిస్తున్నాయి.



అధ్యాపకులకు శిక్షణ తరగతులు ఏవీ..?

జిల్లాలో అన్ని జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న లెక్చరర్స్‌కు ఆయా సబ్జెక్టలలో నిష్ణాతులైన సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌చే శిక్షణ కార్యక్రమాలు నిర్వహించే వారు. అయితే గత రెండు సంవత్సరాల నుంచి శిక్షణ కార్యక్రమాలకు దూరమయ్యారు. ఈ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌తో సిలబస్‌లో మార్పులు, చేర్పులు షార్ట్ మెథడ్‌తో విద్యార్థులకు ఎలా బోధించాలో ఈ శిక్షణలో మెలకువలు నేర్పించేవారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో విద్యార్థులకు సులభరీతిలో బోధించడంతో సాధారణ విద్యార్థులు ఉత్తీర్ణులయ్యేవారు. ఈ సారి శిక్షణ కార్యక్రమానికి అధ్యాపకులు దూరం అయ్యారు.

బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీస్ అవార్డుకు

కలెక్టర్ రాజకుమారి ఎంపిక



నంద్యాల, జనవరి 23, ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి 2024 సంవత్సరానికి బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీస్ అవార్డుకు ఎంపికయ్యారు. జిల్లా కలెక్టర్‌కు ఎన్నికల నిర్వహణలో ఉత్తమ ప్రతిభను కనబరిచేందుకు ప్రత్యేక గుర్తింపు లభించింది. ఎన్నికల నిర్వహణలో విశేష కృషి చేసిన అధికారులను రాష్ట్ర ఎన్నికల సంఘం గుర్తించి గౌరవించే అవార్డుకు కలెక్టర్ ఎంపికయ్యారు. జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఎలక్టోరల్ ప్రాక్టీస్ విభాగం కింద స్టేట్ కేటగిరీలో అవార్డుకు కలెక్టర్ రాజకుమారిని రాష్ట్ర ఎన్నికల సంఘం ఎంపిక చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్‌తో పాటు ఆళగడ్డ తహసీల్దార్ పి.జ్యోతి రత్నకుమారి, ఆళ్లగడ్డ బీఎల్ఓ ఎం.నరేష్ బాబు, నంద్యాల బీఎల్ఓ గ్లోరి థెరిస్సా కూడా ఈ అవార్డుకు ఎంపికయ్యారు. వీరికి ఈనెల 25న అమరావతిలో జరిగే కార్యక్రమంలో అవార్డును అందజేస్తారు.

విజిలెన్స్ తనిఖీలు

నందికొట్కూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో విజిలెన్స్ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ ఎస్పీ చౌడేశ్వరి ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేశారు. నందికొట్కూరు సీఎస్‌డీటీ ఆధ్వర్యంలో జూపాడు బంగ్లా మండలం తాటిపాడు గ్రామంలో రేషన్ దుకాణం తనిఖీ చేశారు. 19 క్వింటాళ్ల రేషన్ బియ్యం తేడా ఉన్నట్లు గుర్తించారు. కర్నూలు రాజధాని బార్ అండ్ రెస్టారెంటులో జాయింట్ ఇన్‌స్పెక్టర్, ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. పలు ఆహార పదార్థాల శాంపుల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపారు. నంద్యాల, కోవెల కుంట్ల పరిసర ప్రాంతాల్లో వాహనాలు తనిఖీలు చేశారు. ఓవర్‌లోడుతో వెళ్తున్న మైనింగ్ వాహనాలను గుర్తించి రూ.9.77లక్షలు జరిమానా విధించారు. నందికొట్కూరులో పలు టిఫిన్ సెంటర్లను తనిఖీ చేశారు. గృహ వినియోగ సిలిండర్లు, వాణిజ్య అవసరాలకు వాడుతున్నట్లు గుర్తించి 12 సిలిండర్లు సీజ్ చేశారు. వీరిపై 6ఏ కేసులు నమోదు చేశారు.

కంది రైతుల కష్టాలు పట్టవా..?



కర్నూలు మార్కెట్‌లో వ్యాపారులకు విక్రయించేందుకు భారీగా రైతులు తెచ్చిన కందులు

- నిధులు లేని మార్క్‌ఫెడ్
- కొరవడిన శాఖల సమన్వయం
- నాఫెడ్ నుంచి సకాలంలో అందని నిధులు
- కందుల సేకరణలో భారీ కోత
- మొదట్లో లక్ష మెట్రిక్ టన్నుల కొనుగోలుకు నిర్ణయం
- తాజాగా 17వేల మెట్రిక్ టన్నులకే పరిమితం
- ఉమ్మడి జిల్లాలో ప్రతి మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రం

కంది రైతులను నిరాశ ఆవరించింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు లక్షన్నర ఎకరాల్లో కంది పంటను సాగు చేశారు. ప్రభుత్వం క్వింటానికి మద్దతు ధర రూ.7,550 ప్రకారం రైతుల నుంచి కొనాలని నిర్ణయించింది. నవంబరు, డిసెంబరు నెలల్లో బహిరంగ మార్కెట్‌లోనే క్వింటం కందులు రూ.9వేల నుంచి రూ.10వేల దాకా అమ్ముడుపోయింది. మార్క్‌ఫెడ్ సంస్థ కొనుగోలు ప్రారంబిస్తే ఈ ధర మరింత పెరుగుతుందని రైతులు ఆశించారు. అయితే అధికారులు కాలయాపన చేయడంతో వ్యాపారులు క్వింటం కందులను బహిరంగ మార్కెట్‌లో రూ.8వేలకే కొంటున్నారు. దాదాపు 80 శాతం పంట దిగుబడిని రైతులు కర్నూలు, ఇతర మార్కెట్ యార్డుల్లో తక్కువ ధరకే అమ్మేశారు. మార్క్‌ఫెడ్ సంస్థ మాత్రం కర్నూలు జిల్లాలో 9వేల మెట్రిక్ టన్నులు, నంద్యాల జిల్లాలో 8వేల మెట్రిక్ టన్నులు మాత్రమే రైతుల నుంచి కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకు కొనడానికి నిర్ణయించుకుంది. మొదట్లో ఈ సంస్థ అధికారులు కర్నూలు జిల్లాలో 56వేల మెట్రిక్ టన్నులు, నంద్యాల జిల్లాలో 43వేల మెట్రిక్ టన్నులు రైతుల నుంచి కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం నవంబరులోనే మార్క్‌ఫెడ్ ప్రకటించినా ఎప్పటికప్పుడు వాయిదా వేస్తూ వచ్చింది. దీంతో బహిరంగ మార్కెట్‌లో పంట దిగుబడి అమ్ముకొని రైతులు నష్టపోయారు.

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కంది పంట సాగు ప్రధానంగా రాయలసీమలోనే ఎక్కువ. అనంతపురంతో పాటు కర్నూలు, నంద్యాల జిల్లాలో దాదాపు 5 లక్షల ఎకరాల్లో ఈ పంటను రైతులు సాగు చేస్తున్నారు. పంట సాగుకు పెట్టుబడి ఖర్చులు ఎక్కువగా ఉండవనే ఉద్దేశంతో రైతులు కంది పంట సాగుపైనే ఇటీవల కాలంలో శ్రద్ధ చూపుతున్నారు. గత సంవత్సరం క్వింటం కందులకు 8 నుంచి 10వేలకు పైగా ధర లభించడంతో ఈసారి పెద్ద ఎత్తున కంది సాగు చేశారు. అయితే.. రైతుల నుంచి పెద్దఎత్తున కందుల కొనుగోలుకు మొదట్లో సిద్ధమైన కేంద్ర సంస్థ నాఫెడ్ నుంచి అరకొరగానే కొనుగోలుకు అనుమతులు రావడంతో మార్క్‌ఫెడ్ సంస్థ సొంతంగా నిధులు సమకూర్చుకుని రైతుల నుంచి కందుల కొనుగోలుకు సిద్ధం కాలేని పరిస్థితులు నెలకొన్నాయి. ధాన్యం సేకరణకు వివిధ ఆర్థిక సంస్థల నుంచి రూ.6వేల కోట్ల అప్పు తెచ్చిన మార్క్‌ఫెడ్ రైతులకు సకాలంలో వారి బ్యాంకు ఖాతాలకు డబ్బులు జమ చేసింది. అయితే.. అదే స్థాయిలో రాయలసీమలో కంది రైతుల నుంచి వాటిని కొనుగోలు చేసేందుకు మాత్రం ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆ సంస్థ అధికార వర్గాలు తెలిపాయి. రాష్ట్ర వ్యాప్తంగా కేంద్రం ప్రకటించిన మద్దతు ధరపై కందుల కొనుగోలుకు రూ.100 కోట్లు అవసరమని అంచనా. ఈ నిధుల కోసం గత రెండు నెలలుగా సంస్థ అధికారులు ఆర్థిక శాఖ ఆమోదం కోసం కుస్తీలు పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ పరిస్థితుల్లో నిధులు లేకపోవడంతో నాఫెడ్ ఆమోదించిన మేరకు తక్కువ మొత్తంలో రైతుల నుంచి కందుల కొనుగోలు చేసేందుకు మార్క్‌ఫెడ్ సంస్థ సిద్ధమవుతున్నది. ఒక్క ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే లక్ష మెట్రిక్ టన్నుల కందులు కొనుగోలు చేస్తామని రెండు నెలల కిందటే మార్క్‌ఫెడ్ సంస్థ అధికారులు ప్రకటించినా చివరకు నిధుల లేమితో కేంద్ర సంస్థ నాఫెడ్ ఆమోదంతో కేవలం రెండు జిల్లాలో 17వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

నాఫెడ్ నిధులు ఎప్పుడు వస్తాయో..

గతంలో మొక్కజొన్నలు రైతుల నుంచి మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా సేకరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అయితే మార్క్‌ఫెడ్ సంస్థకు కేంద్ర సంస్థ నాఫెడ్ నుంచి నిధులు పెద్ద ఎత్తున అందకపోవడంతో దాదాపు ఆరు నెలల జాప్యంతో మొక్కజొన్నలు విక్రయించిన రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేసింది. తాజాగా కందుల విషయంలోనూ అదే పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందేమోనని మార్క్‌ఫెడ్ సంస్థ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాఫెడ్ సంస్థ నుంచి త్వరితగతిన రైతుల నుంచి సేకరించిన కందులకు డబ్బులు విడుదల చేస్తే ఏ ఇబ్బందులు ఉండవని, లేకపోతే రైతుల నుంచి పెద్ద ఎత్తున నిరసన ఎదుర్కోవాల్సి వస్తుందేమోనని వారు ఆందోళన చెందుతున్నారు.




శాఖల మధ్య సమన్వయం ఏదీ..?

పక్క రాష్ట్రం కర్ణాటకలో రైతుల నుంచి సేకరించే కందులపై క్వింటానికి రూ.450 బోనస్ ఇస్తోంది. అదే విధంగా తెలంగాణలో వరి రైతులకు క్వింటానికి రూ.500 బోనస్ ఇస్తోంది. అదే విధంగా రాయలసీమలో పెద్ద ఎత్తున కందులను పండించే రైతులను కూడా ప్రోత్సహించేందుకు కర్ణాటక రాష్ట్రం మాదిరి క్వింటానికి రూ.450 బోనస్ ఇవ్వాలని రైతు సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో క్వింటం కంది ధర రూ.8వేల దాకా ఉంది. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర కేవలం రూ.7,550 మాత్రమే. ఈ పరిస్థితుల్లో రైతులు మార్క్‌ఫెడ్ సంస్థకు కందులు విక్రయించేందుకు ఏ మాత్రం సుముఖత వ్యక్తం చేయడం లేదు. అదే విధంగా డబ్బులు కూడా వెంటనే అందించే అవకాశం లేదని, నెలల తరబడి జాప్యం చేస్తే తమకు నష్టం తప్ప ఏ మాత్రం ప్రయోజనం ఉండదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందువల్లనే ఉమ్మడి కర్నూలు జిల్లాలో బుధవారం నుంచే కందుల కొనుగోలుకు విక్రయ కేంద్రాలకు చర్యలు చేపట్టినా రైతులు మాత్రం ఆ వైపు చూడటం లేదు.

కందుల కొనుగోలుకు ఏర్పాట్లు షురూ

ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైతుల నుంచి రూ.17వేల మెట్రిక్ టన్నులు కొనడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. బుధవారం నుంచే రైతులు తమ వివరాలను రైతు సలహా కేంద్రాల్లో నమోదు చేయించాలని విజ్ఞప్తి చేశాం. రైతుల నుంచి పూర్తి స్థాయిలో వివరాలు అందగానే కొనుగోలు కేంద్రాల ద్వారా కందులను కొంటాం. కేంద్ర సంస్థ నాఫెడ్ ఈసారి నిధులను వెంట వెంటనే విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. రైతులు ఆందోళన చెందనవసరం లేదు.

-రాజు, మార్క్‌ఫెడ్, డీఎం



నేడు మార్కెటింగ్ శాఖ జేడీ రాక

రైతులకు వసతులు, సెస్సు వసూళ్లపై దిశా నిర్దేశం

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఈసారి ఖరీఫ్, రబీ సీజన్లలో పంట దిగుబడులు గతంలో కంటే రైతులకు అధిక మొత్తంలో అందాయి. అదే విధంగా పంట ఉత్పత్తులకు ధరలు కూడా మద్దతు ధరకు మించి అందుతుండటం వల్ల వ్యాపారుల నుంచి మార్కెటింగ్ శాఖకు రావాల్సిన సెస్సు ఆదాయాన్ని రాబట్టేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా రాయలసీమ మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు సెస్సు వసూళ్లతో పాటు మార్కెట్ యార్డుల్లో రైతులకు అవసరమైన వసతుల ఏర్పాట్లపై చర్చించేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 15 మార్కెట్ కమిటీల సెక్రటరీలతో శుక్రవారం అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ప్రధానంగా పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరిగే కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులో పంట ఉత్పత్తుల విక్రయాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకునేలా మార్కెట్ కమిటీల సెక్రటరీలకు ఆదేశాలు జారీ చేయనున్నట్లు సమాచారం. అదే విధంగా పెద్ద ఎత్తున ఈ రెండు జిల్లాలో వ్యాపారులు జీరోపై పంట ఉత్పత్తులను ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ మార్కెటింగ్ శాఖ ఆదాయానికి గండి కొడుతున్నారు. వీరి అక్రమాలను నిరోధించేందుకు జేడీ రామాంజనేయులు మార్కెటింగ్ కమిటీ సెక్రటరీలకు దిశా నిర్దేశం చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

13వ రోజు 280 మంది ఎంపిక

దేహదారుఢ్య పరీక్షలను పర్యవేక్షించిన ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

కర్నూలు క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుళ్ల నియామక దేహదారుఢ్య పరీక్షలు గురువారం 13వ రోజు కొనసాగింది. స్థానిక ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లో నిర్వహించే ఈ పరీక్షలకు నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పర్యవేక్షించారు. ఈ పరీక్షకు 600 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 411 మంది బయో మెట్రిక్‌కు హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, ఛాతీ ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు నిర్వహించారు. అనంతరం వీరికి నిర్వహించిన ఫిజకల్ ఎఫిషియన్సీ టెస్టులు 1600 మీటర్ల పరుగు పరీక్షలో 298 మంది అర్హత సాధించారు. 100 మీటర్ల పరుగులో 174 మంది అర్హత సాధించారు. లాంగ్‌జంప్‌లో 275 మంది అర్హత సాధించారు. కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షకు 13వ రోజు 280 మంది అర్హత సాధించారు. ఇన్‌చార్జి ఎస్పీ హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి. హుశేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణ మోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

రేపు కళావాహిని సాంస్కృతిక ప్రదర్శనలు

కర్నూలు కల్చరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని కళావాహిని సాంస్కృతిక, సాహితీ సంస్థ ఆధ్వర్యంలో రిపబ్లిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలబాలికల సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం. మనోహర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 6.30 గంటలకు నగరంలోని కొండారెడ్డి బురుజు వద్ద నున్న మున్సిపల్ పార్కులో ఈ ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఈ ప్రదర్శనల్లో భాగం కావాలని అనుకున్నవారు తమ పేర్లను సెల్ నెం. 88863 74796, 77029 44714లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఎటూ తేలని నీరు-చెట్టు లెక్కలు

5వ పేజీ తరువాయి

నీరు-చెట్టు పథకం బిల్లులు ఎంత చెల్లించాలి..? ఆ బిల్లులు క్లియర్ చేయాలనే లక్ష్యంగా ప్రభుత్వం ఇప్పటికే రెండు విడతలుగా సమీక్ష నిర్వహించారు. నెలనెలా బిల్లులు పెరుగుతుండడంతో జలవనరుల శాఖ అధికారులు విస్తుపోతున్నారు. దీంతో ఈ నెల 31వ తేదిలోగా నీరు-చెట్టు పనుల లెక్కలు తేల్చండి. పెండింగ్ బిల్లులు అప్ లోడ్ చేసి బిల్లులు క్లోజ్ చేశామని సంబంధిత డ్రాయింగ్ అథారిటీ అధికారి డిక్లరేషన్ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఆ బాధ్యతను నీరు-చెట్టు నోడల్ అధికారులకు అప్పగించారు. 31వ తేది తరువాత వచ్చే బిల్లులు అప్‌లోడ్ చేయబోమని, వాటిని పరిగణలోకి తీసుకోమని కూడా తేల్చి చెప్పారు. దీంతో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 16 డివిజన్ల పరిధిలో నీరు-చెట్టు లెక్కలు తేల్చేందుకు అధికారులు రికార్డులతో కుస్తీ పడుతున్నారు. ఇప్పటికీ సుమారు రూ.300 కోట్లకు పైగా బిల్లులు చెల్లించాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. బిల్లులు అప్‌లోడ్ చేయడానికి ప్రభుత్వం ఈ నెలాఖరుకు గడువు పెట్టడంతో బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కాంట్రాక్టర్లు, టీడీపీ కార్యకర్తలు ఇంజనీరింగ్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

నివేదిక తయారు చేస్తున్నాం

నీరు-చెట్టు పనుల్లో ఎన్ని బిల్లులు పెండింగ్‌లో ఉన్నదీ గుర్తించి ఈ నెల 31లోగా అప్‌లోడ్ చేయమని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగానే సబ్ డివిజన్ల వారిగా నివేదికలు తయారు చేస్తున్నాం. ఈ నెలాఖరులోగా ప్రభుత్వానికి పంపుతాం.

- బి. బాలచంద్రారెడ్డి, ఎస్ఈ, జలవనరుల శాఖ, కర్నూలు

విజిలెన్స్ విచారణ

కర్నూలు జిల్లాలో నీరు-చెట్టు బిల్లులు చెల్లింపులో భారీగా అక్రమాలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. గంపెడు మట్టి తీయకుండా చేయని పనులను చేసినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో డోన్, బేతంచర్ల, వెల్దుర్తి, కృష్ణగిరి, ఆస్పరి, గోనెగండ్ల, ఆదోని మండలాల్లో మైనర్ ఇరిగేషన్ విభాగంలో నీరు-చెట్టు కింద మంజూరైన పనులు గుర్తించి ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి బిల్లులు అప్‌లోడ్ చేసి వందకుపైగా పనులకు సబంధించి సుమారుగా రూ.10 కోట్లకుపైగా అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అత్యధికంగా డోన్, బేతంచర్ల మండలాలు అక్రమాలు జరిగితే.. ఆ తరువాత స్థానాల్లో గోనెగండ్ల, ఆస్పరి, ఆదోని మండలాలు ఉన్నాయి. ఈ భాగోతం వెనుక గతంలో ఇక్కడ పని చేసిన బదిలీపై వెళ్లిన వైసీపీ రంగు పూసుకున్న ఓ అధికారి పాత్రపై ఉందనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. గతంలోనే ఆంధ్రజ్యోతి వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చింది. ఈ అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దృష్టి సారించారు. విచారణలో భాగంగా జిల్లాలో జరిగిన నీరు-చెట్టు పనుల సమగ్ర వివరాలు ఇవ్వాలంటూ జలవనరుల శాఖ అధికారులకు విజిలెన్స్ ఎస్పీ లేఖ రాసినట్లు తెలుస్తున్నది. అయితే.. నెల రోజులు దాటినా అధికారులు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు సమగ్ర వివరాలతో నివేదిక ఇవ్వలేదని సమాచారం.



గోనేగండ్ల మండలం గంజేహళ్లి గ్రామ సమీపంలోని మల్లెల వంక. ఈ వంకపై మూడు చెక్ డ్యాంలు నిర్మించినట్లు రూ.29.50 లక్షలకు ఫోర్జరీ సంతకాలతో ఓ కాంట్రాక్టరు రికార్డులు సృష్టించారు.

కష్టపడే వారికే పార్టీలో గుర్తింపు

20 సూత్రాల చైర్మన్ లంకా దినకర్



కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పని చేస్తే పార్టీ గుర్తిస్తుందని, ఎవరూ నిరుత్సాహపడవద్దని 20 సూత్రాల చైర్మన్ లంకా దినకర్ తెలిపారు. గురువారం స్థానిక నరసింహారెడ్డి నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లంకా దినకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ప్రభు త్వంలోనేగాక పార్టీలో ఉండి కూడా ప్రజలకు సేవ చేయవచ్చునన్నారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు అర్హులైన వారికి అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆదోని ఎమ్మెల్యే వాల్మీకి పార్థసారధి మాట్లాడుతూ బీజేపీ కార్యకర్తలు అంకిత భావంతో పార్టీ అభివృద్ధికి పని చేయాలన్నారు. ఎప్పటికప్పుడు వైసీపీ దుర్మార్గాలను పసిగట్టి అరికట్టాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బీఎస్ నాగరాజు, రామస్వామి, రాఘవేంద్ర, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న 20 సూత్రాల చైర్మన్ లంకా దినకర్

ముగిసిన నంది బాలోత్సవాలు

నంద్యాల రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా కేంద్రంలోని టౌన్‌హాల్‌లో నిర్వహించిన నంది బాలోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ బాలోత్సవాల్లో జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలలకు చెందిన ఐదువేల మంది విద్యార్థులు పలు రకాల ప్రదర్శనల్లో పాల్గొని ప్రతిభను చాటారు. రెండోరోజు గురువారం ఫ్యాన్సీడ్రెస్, క్లాసికల్‌డ్యాన్స్, జానపదనృత్యం, దేశభక్తి, కోలాటం, మట్టితో బొమ్మలతయారీ, క్విజ్, తెలుగు, ఇంగ్లీష్‌లో ఉపన్యాసం, పద్యభావం తదితర కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన విద్యార్థులకు డీఈఓ జనార్దన్‌రెడ్డి, డాక్టర్ క్రాంతిచైతన్యలు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నంది బాలోత్సవ నిర్వాహకులు శంకరయ్య, మౌలాలి, బాస్కరరావు, నాగరాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాలను అందజేస్తున్న డీఇవో జనార్దన్‌రెడ్డి

నేడు విద్యాశాఖ రాష్ట్ర కమిషనర్ విజయరామరాజు రాక

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాకు పాఠశాలల విద్యాశాఖ రాష్ట్ర కమిషనర్ విజయరామరాజు శుక్రవారం కర్నూలు రానున్నారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు జి. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలోని మీటింగ్ హాల్‌లో రెండు జిల్లాలకు సంబంధించిన విద్యాశాఖ అధికారులు, ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించనున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 117 జీవోను రద్దు చేసింది. కొత్తగా స్కూల్ కాంప్లెక్స్‌లను బలోపేతం చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు విద్యాశాఖ అధికారులతో సూచనలు, సలహాలను స్వీకరించనున్నారు. పాఠశాలలపే ఎలా బలోపేతం చేయాలో దానికి సంబంధించిన అంశాలను విద్యాశాఖ అధికారులకు ఆయన దిశా నిర్దేశం చేయనున్నారు.

ఉద్యోగాల కల్పనలో సర్కార్ వైఫల్యం

ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి తిరుమలై రామన్



మాట్లాడుతున్న జాతీయ కార్యదర్శి టి.రామన్

కర్నూలు న్యూసిటీ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఉద్యోగ కల్పనలో వైఫల్యం చెందిందని ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి తిరుమలై రామన్ విమర్శించారు. గురువారం నగరంలోని చంద్ర రాజేశ్వర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీఎస్సీ నోటిఫికేషన్‌కి మొదటి సంతకం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటి వరకు దాని గురించి మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. అంతేకాకుండా అమరావతిని ఫ్రీజోన్‌గా చేసి 26 జిల్లాల నిరుద్యోగ యువతకు రాష్ట్ర రాజధానిలో ఉద్యోగాలు పొందేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలు ఏప్రిల్ మొదటి వారంలో కర్నూలు నగరంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు వీసీలను నియమించే అధికారం రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉండేదని, అయితే మోదీ ప్రభుత్వ ఆ హక్కును కాలరాస్తూ వీసీల నియామకాన్ని తమ చేతుల్లోకి తీసుకుందన్నారు. మోదీ ప్రభుత్వం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని లేనిపక్షంలో దేశవ్యాప్తంగా నిరుద్యోగ భృతిని రూ.15 వేలు ఇవ్వాలన్నారు. మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు, ఉపాధ్యక్షుడు కారుమంచి, నాగరాముడు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, షాపీర్‌బాషా, ఉపాధ్యక్షుడు శరత్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల సమస్యలపై అవగాహన పెంచాలి

ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మలమ్మ

కర్నూలు రూరల్ జనవరి 23(ఆంధ్రజ్యోతి): కౌమార బాలికల సమస్యలపై అవగాహన పెంచాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మలమ్మ అధికారులకు ఆదేశించారు. ఈమేరకు కర్నూలు మండల ప్రజా పరిషత సమావేశ భవనంలో గురువారం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిశోర వికాసం గురించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మలమ్మ మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న బాలికలకు ఎదురయ్యే సమస్యలు, ఆరోగ్యవంతమైన అలవాట్లపై అవగాహన కల్పించాలని అన్నారు. వాటితో పాటు పోషణ అవసరాలు, పిల్లల సంరక్షణ బాలికల నైపుణ్యాలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో వరలక్ష్మీదేవమ్మ, ఏసీడీపీవో నరసమ్మ, డీసీపీవో శారద, ఎంపీడీవో రఘునాథ్, ఎంఈవో హనుమంతరావు, వినోద్‌కుమార్, మెడికల్ అధికారి హేమలత, ఏపీఎం వసంత, ఐసీపీఎస్ నరసింహులు, సూపర్‌వైజర్లు పద్మావతి, విజయలక్ష్మి, జరీనాబాను పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

కర్నూలు క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో రెండు వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వృద్ధులు మృతి చెందారు. కర్నూలు మెడికల్ కళాశాల వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో సత్యనారాయణ (74) అనే వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక బీ. క్యాంపు చెందిన సత్యనారాయణ బుధవారపేటలో ఉన్న ఓ కళాశాలలో తన మనుమళ్ల ఫీజు కట్టేందుకు వెళ్లి తిరిగి మోటారు సైకిల్‌పై వస్తుండగా.. నందికొట్కూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన కింద పడగా.. బస్సు టైరు సత్యనారాయణ తలపై వెళ్లింది. స్థానికులు ఆసుపత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సత్యనారాయణ రిటైర్డు డ్వామా ఉద్యోగి. ఆయనకు ఇద్దరు కొడుకులు సంతానం ఉన్నారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- హైదరాబాదు జాతీయ రహదారి సంతోష్‌నగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సురేంద్రవర్మ (72) అనే వృద్ధుడు దుర్మరణం చెందాడు. స్థానిక సంతోష్‌నగర్‌కు చెందిన సురేంద్రవర్మ పేపరు మిల్లులో ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందాడు. బుధవారం రాత్రి మెడికల్ దుకాణానికి వచ్చి రోడ్డు దాటుతుండగా.. బెంగుళూరు నుంచి హైదరాబాదు వైపు వెళ్తున్న బైకు ఢీ కొట్టింది. సురేంద్రవర్మ తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో కోలుకోలేక గురువారం రాత్రి మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని బాలుడు..

పెద్దకడుబూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హనుమాపురం గ్రామ సమీపంలోని ఆదోని- ఎమ్మిగనూరు ప్రధాన రహదారిలో కారు- బైక్ ఢీకొని బాలుడు మృతి చెందాడు. కొత్త గొల్లల దొడ్డి గ్రామానికి చెందిన బోయ శంకర్ (14) తన తాత బందరామన్న గ్రామమైన హనుమాపురం వెళ్లాడు. అక్కడ నుంచి స్కూటర్‌పై పొలానికి బయలుదేరాడు. ఎమ్మిగనూరు నుంచి ఆదోనికి వెళ్తున్న కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి ఈరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

కర్నూలు క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉల్చాల రోడ్డులో సుద్దబాయి సమీపంలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమేశ్వరి(27) దుర్మరణం చెందింది. మోటారు సైకిల్‌పై వస్తున్న ఇద్దరు యువకులు ఆటోను వేగంగా వచ్చి ఢీకొనడం వల్లనే ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు ఉర్దూ టీచర్లు, మరో ఇద్దరు ప్రయాణికులు గాయపడ్డారు. వివరాలివి.. ఉల్చాల గ్రామానికి చెందిన సోమేశ్వరి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్టు నర్సుగా పని చేస్తున్నా. బుధవారం రాత్రి విధులకు వచ్చి గురువారం ఉదయం ఉల్చాలకు బయలుదేరారు. ఆమె ప్రయాణిస్తున్న ఆటోలో ఇదే గ్రామంలో ఉర్దూ పాఠశాలలో పని చేస్తున్న షేకూన్‌బీ అనే మరో ఉపాధ్యాయురాలితో పాటు మరో ఉపాధ్యాయురాలు, ఇద్దరు ప్రయాణికులు ఉన్నారు. ఆటో సుద్దబావి వద్దకు చేరుకోగానే ఉల్చాల వైపు నుంచి వస్తున్న ఇద్దరు యువకులు వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ముందు కూర్చున్న సోమేశ్వరి కాళ్లకు బలంగా దెబ్బ తగిలింది. దీంతో పాటు ఆటో పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సోమేశ్వరి కాళ్లు నుజ్జునుజ్జు కాగా ఆమె అపస్మారక స్థితికి చేరుకున్నారు. స్థానికులు అప్రమత్తమై ఆటోను పైకి లేపి అందులో గాయపడిన వారిని బయటకు తీసుకువచ్చారు. అనంతరం వీరందరినీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సోమేశ్వరి ఆసుపత్రికి చేరుకోకముందే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గాయపడిన వారికి ఆసుపత్రి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పోలీసులు సోమేశ్వరి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. సోమేశ్వరికి భర్త శివకుమార్, ఇద్దరు చిన్న పిల్లలు సంతానం. ప్రమాదానికి కారణమైన ఇద్దరు యువకుల్లో ఒకరికి చేయి విరిగింది. ప్రమోటారు సైకిలిస్టులపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.

వెంకటగిరిలో డీఎస్పీ విచారణ



గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ బాబుప్రసాద్

కోడుమూరు రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటగిరి ప్రాథమిక పాఠశాల(స్పెషల్)లో ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినుల పట్ల లైంగిక వేధింపుల కేసులో పోక్సో చట్టం, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఈ మేరకు గురువారం డీఎస్పీ బాబూ ప్రసాద్ వెంకటగిరి ఎస్సీ కాలనీలో ఉన్న పాఠశాల వద్ద విచారించారు. డీఎస్పీ ప్రజలు, బాలికలను వేర్వేరుగా విచారించారు. ఎంతో గౌరవప్రదమైన గురువు స్థానంలో ఉండి విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా వ్యవహరించిన ఉపాధ్యాయుడిపై కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరారు. అలాగే ఎమ్మార్పీఎస్ నాయకులు నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరారు. డీఎస్పీ వెంట సీఐ తబ్రేజ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

డీజిల్ చోరీ



నంద్యాల ఇసుక డంప్ యార్డు వద్ద నిలిపి ఉంచిన లారీలు

నంద్యాల క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నంద్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగలు పలు లారీల్లో నుంచి డీజిల్ దొంగతనం చేశారు. మూడు లారీల్లోని డీజిల్‌తో పాటు మరో లారీకి సంబంధించిన బ్యాటరీ ఎత్తుకెళ్లారు. నంద్యాల మండలం అయ్యలూరి మెట్ట సమీపంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఇసుక డంప్ యార్డును ఏర్పాటు చేశారు. ఈ ఇసుక డంప్‌యార్డుకు ఇతర ప్రాంతాల నుంచి లారీలు, టిప్పర్లలో ఇసుకను తరలిస్తుంటారు. ఇసుక అన్‌లోడ్ చేసిన తర్వాత కొన్ని లారీలు, టిప్పర్ల డ్రైవర్లు ఇక్కడే రాత్రి బస చేస్తుంటారు. అయితే గురువారం తెల్లవారుజామున కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ప్రభుత్వ ఇసుక డంప్‌యార్డులోకి ప్రవేశించి మూడు లారీల్లోని వందలాది లీటర్ల డీజిల్‌ను ఎత్తుకెళ్లారు. ఆయా లారీల డ్రైవర్లు ఉదయమే తమ లారీల వద్దకు వెళ్లి చూసుకోగా డీజిల్ ట్యాంకల మూతలు తీసి ఉండటం గమనించారు. మరో లారీలోని బ్యాటరీని ఎత్తుకెళ్లారు. బాధిత లారీల డ్రైవర్లు నంద్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది. డీజిల్ దొంగలు స్థానికులు, స్థానికేతరులా అన్న విషయమై నంద్యాల రూరల్ పోలీసులు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

కంది కొనుగోళ్లు ప్రారంభం

ఆదోని అగ్రికల్చర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కంది రైతుల నుంచి తొమ్మిది వేల టన్నుల కంది దిగుబడిని కేంద్రం ప్రకటించిన మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ రాజు వెల్లడించారు. గురువారం ఆదోని మార్కెట్ యార్డులోని డీసీఎం గోదాం వద్ద మద్దతు ధరతో కంది కొనుగోలు కేంద్రాన్ని ఏడీఏ బాలవర్ధి రాజుతో కలిసి ప్రారంభించారు. కంది రైతులు కేంద్రం ప్రభుత్వ కనీస మద్దతు ధర క్వింటాకు రూ.7,550కి విక్రయించుకోవాలని సూచించారు. జిల్లాలో 25 కొనుగోలు కేంద్రాలకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. 456 రైతు భరోసా కేంద్రాలను మ్యాపింగ్ చేశామని తెలిపారు. ఒక్కో రైతు నుంచి 100 క్వింటాళ్ల కందిని కొనుగోలు చేస్తామన్నారు. రైతులు ఆర్బికేలలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. తప్పకుండా ఈ క్రాప్ నమోదై ఉండాలన్నారు. కొనుగోలు చేసిన 15 రోజుల్లో రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తామన్నారు. ఆదోని, ఆలూరు, ఆస్పరిలలో మొదటి విడతగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. ఏవో అశోక్ కుమార్ రెడ్డి, కేడీసీఎంఎస్ మేనేజర్ ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం

- పథకాల అమలులో అధికారుల పాత్ర కీలకం
- 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్



మాట్లాడుతున్న లంకా దినకర్, పక్కనే కలెక్టర్ రంజిత్ బాషా



గౌరు చరిత (పాణ్యం) | శ్యాంబాబు (పత్తికొండ) | విరుపాక్షి (ఆలూరు) | పార్థసారథి (ఆదోని) | పాపిరెడ్డి (జడ్పీ చైర్మన్)

కర్నూలు కలెక్టరేట్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పించిన వికసిత భారత్, రాష్ట్ర ముఖ్యమంత్రి అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధన కోసం పని చేయాలని 20 సూత్రాల కార్యక్రమం చైర్మన్ లంకా దినకర్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలుపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ వికసిత భారత్‌లో స్వర్ణాంధ్రను భాగస్వామ్యం చేసేలా ప్రజల జీవన ప్రమాణాల పెంపు, పేదరిక నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వెళ్తున్నాయన్నారు. వికసిత కర్నూలుగా తీర్చిదిద్దేందుకు అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. కర్నూలులో, ఆదోనిలో అమృత్-1 పనులు కొంతమేర పూర్తయ్యాయని, మిగిలిన పనులు మార్చిలోపు పూర్తి చేయాలని చైర్మన్ అధికారులను ఆదేశించారు. అదే అమృత్-2 టెండర్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ ఆర్అండ్‌బీకి రూ.13 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఉపాధి హామీ నిధులతో ఇంటర్నల్ సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని అన్నారు. జిల్లాలో టెక్స్‌టైల్ పార్కు కోసం స్థలం గుర్తించామన్నారు. జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాల కోసం అదనపు రిజర్వాయర్లు నిర్మించాలని అన్నారు. ఆదోని ఎమ్మెల్యే డా.పార్థసారథి మాట్లాడుతూ ఆదోనిలో పత్తి కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మేనేజర్ ఫ్యాక్టరీలతో కుమ్మక్కై కమీషన్ తీసుకుంటూ రైతులను ఇబ్బందులు పెడుతున్నాడని, విచారణ చేయాలని కోరారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ పత్తికొండ పట్టణానికి టిడ్కో గృహ నిర్మాణాలు కేటాయించాలని, బొంతిరాళ్ల- బొందిమ డుగుల రోడ్డు నిర్మాణాన్ని బాగు చేయాలని అన్నారు. ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి మాట్లాడుతూ ఆలూరు పట్టణంలో తాగునీటి సమస్యను, చింతకుంట నుంచి వేసిన బీటీ రోడ్డు, హొళగుంద- కొవ్వలతోట రోడ్లను రిపేరు చేయించాలన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ కోడుమూరు పట్టణంలో ఎప్పుడో పాతకాలం నాటి ఎస్ఎస్ ట్యాంకు ఇప్పటికి వాడుకోవాల్సి వస్తుందని, ఆ నీరు సరిపోవడం లేదని అన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ నగరంలో 16 వార్డులో తాగునీటి సమస్యలు ఉన్నందువల్ల గోరుకల్లు రిజర్వాయర్ నుంచి నీరు అందించాలన్నారు. ఈ సమావేశంలో జేసీ డా.బి. నవ్య, మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రారెడ్డి, రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ కొంకతి లక్ష్మీనారాయణ, కురుబ కురవ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, డైరెక్టర్లు ఉదయ్ కుమార్, శ్రీనివాసులు, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సంజమ్మ పాల్గొన్నారు.

లోకేశ్ పాదయాత్రతో భరోసా

- ఓర్వకల్లుకు భారీ పరిశ్రమలు, ప్రాజెక్టులు
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నారా లోకేశ్ చేసిన పాదయాత్ర రాష్ట్ర ప్రజల్లో భరోసా ను కలిగించిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పేర్కొన్నారు. ఆయన పాదయాత్ర ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 12 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు గెలిచి ఎన్డీయే కూటమి సత్తా చాటిందన్నారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌బాబుతో కలిసి లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ముందుగా కేక్ కట్‌చేసి విశ్వేశ్వరయ్య సర్కిల్‌లో పంచి పెట్టారు. అనంతరం తిక్కారెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే లోకేశ్ రాష్ట్ర ప్రగతిపై దృష్టి సారించారన్నారు. దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేని విధంగా తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలను తయారు చేశారన్నారు. అధినేత చంద్రబాబు ఆదేశాలతో కోటికి పైగా సభ్యత్వాలను నమోదు చేసి, రికార్డు సృష్టించారన్నారు. జిల్లాలో గుండ్రేవుల, ఆర్డీఎస్, వేదవతి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారని తెలిపారు. ఓర్వకల్లుకు భారీ పరిశ్రములు తెచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు.



ఎమ్మెల్యే శామ్‌బాబుకు కేక్ తినిపిస్తున్న కుడా చైర్మన్ సోమిశెట్టి



రమణమ్మ కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న నాయకులు

కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మంత్రి లోకేశ్ నాయకత్వంలో యువతకు ఉపాధితో పాటు పరిశ్రమలకు ప్రాధాన్యమిస్తున్నారన్నారు. జిల్లాకు చెందిన మంత్రి టీజీ భరత్‌తో కలిసి దావోస్ పర్యటనలో అత్యధిక పెట్టుబడులతో రాష్ట్రానికి వన్నె తెస్తున్నారని తెలిపారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న వెల్దుర్తి మండలానికి చెందిన బోయ రమణకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.4.58 లక్షల చెక్కును ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌బాబు సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు అబ్బాస్, నగరాధ్యక్షుడు నాగరాజు, కార్పొరేటర్లు పద్మలతారెడ్డి, స్వామిరెడ్డి, సత్రం రామకృష్ణుడు, పేరపోగు రాజు, భాస్కర్‌రెడ్డి, చంద్రకాంత్, బేతంక్రిష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ ప్రారంభం



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను త్వరలో ప్రారంభించడానికి చర్యలు చేపట్టినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం సర్వజన వైద్యశాల ధన్వంతరి హాలులో హెచ్‌వోడీలతో ఎన్టీఆర్ వైద్యసేవ, ఈ-హాస్పిటల్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవలకు ప్రభుత్వం కొత్త టార్గెట్ ఇచ్చిందన్నారు. 20శాతం లోకల్ పర్చేజ్ కింద మందుల కొనుగోలుకు డీఎంఈ అనుమతి ఇచ్చారని, అన్ని విభాగాల హెచ్‌వోడీలు కావాల్సిన డ్రగ్స్, వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సేవలు ప్రారంభించడానికి చర్యలను హెచ్‌వోడీలతో సమీక్షించారు. ఓపీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సీనియర్ ఫ్యాకల్టీ వైద్యులు ఓపీ విభాగంలో అందుబాటులో ఉండేలా చూసుకోవాలని హెచ్‌వో డీలను ఆదేశించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డా.కే.సీతారామయ్య, సివిల్ సర్జన్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, ఏడీ రమేష్‌బాబు పాల్గొన్నారు.

'ఆమెకు పని చేద్దామన్న ఆలోచన లేదు'



మాట్లాడుతున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

- దళిత తహసీల్దార్‌పై మంత్రి ఫరూక్ అసహనం
- వైరల్‌గా మారిన మంత్రి వీడియో

నంద్యాల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఓ దళిత సామాజికవర్గానికి చెందిన తహసీల్దార్‌పై చేసిన వ్యాఖ్యలు నంద్యాల జిల్లాలో వైరల్‌గా మారాయి. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలో రెండు రోజుల క్రితం సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాల భూమి పూజకు మంత్రి హాజరయ్యారు. స్థానికులు కొందరు నంద్యాల అర్బన్ తహసీల్దార్ ప్రియదర్శినిపై మంత్రికి ఫిర్యాదు చేశారు. దీంతో మంత్రి ఫరూక్ తహసీల్దార్‌పై అసహనం వ్యక్తం చేశారు. 'ప్రజలకు పనిచేద్దామనే ఉద్దేశం ఆమెకు లేదు. ఆమెంతకు ఆమె తప్పించుకుని పోవాలి కదా? పోనీ బాధ్యతగా పనిచేయాలి కదా..? లేకుంటే యాక్షన్ తీసుకోవాలి. ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు చెప్పాను. పని చేయకపోతే ప్రజలకు ఎందుకు..? ప్రభుత్వం జీతం ఇస్తోంది కదా? బాధ్యతగా పనిచేయాలి. ఊరకనే ఆఫీసులో కూర్చొని, ఎవరు వచ్చినా పలకుండా, పనులు చేయకుండా ఉంటే ఏలా..' అంటూ మంత్రి కామెంట్స్ చేశారు. అయితే మంత్రి మాట్లాడిన ఈ వీడియో క్లిప్పింగ్‌ను కొందరు సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వైరల్‌గా మారింది. విధి నిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరిస్తూ బాధ్యతగా పనిచేస్తున్న దళిత సామాజిక వర్గానికి చెందిన తహసీల్దార్‌పై మంత్రి ఇలా మాట్లాడటం అవమానించడమేనని దళిత సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా రెండు రోజుల తరువాత ఈ వ్యాఖ్యలు వైరల్ కావడం.. అటు దళిత వర్గాలతో పాటు రెవెన్యూ ఉద్యోగుల్లోను చర్చకు దారి తీసినట్లయింది.

'ఛత్తీస్‌ఘడ్‌లోంచి సైన్యాన్ని ఉప సంహరించాలి'



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక నాయకులు

కర్నూలు కల్చరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌ఘడ్‌లోంచి సైన్యాన్ని ఉపసంహరించాలని ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఛత్తీస్‌ఘడ్- ఒడిషా సరిహద్దులోని గరియాబండ్ ప్రాంతంలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌ను నిరసిస్తూ వేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల చేతుల్లో కీలుబొమ్మగా మారి, దేశ సంపదలను కార్పొరేట్‌కు ధారాదత్తం చేయడానికి అటవీ ప్రాంతం నుంచీ ఆదివాసులను ఏరివేస్తున్నదని ఆరోపించారు. విరసం నాయకుడు పాణి మాట్లాడుతూ భారత సైన్యం సొంత ప్రజలైన ఆదివాసులు, మావోయిస్టులపైనే బాంబులు, ఆయుధాలతో కగార్ పేరుతో యుద్ధం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం సైనిక బలగాలను మధ్య భారతదేశం నుంచి ఉపసంహరించుకోవాలని కోరారు. పౌరహక్కుల సంఘం నాయకుడు అల్లాబ కాష్, రైతు కూలీ సంఘం నాయకుడు సుంకన్న, ప్రజా అభ్యుదయ సంస్థ నాయకుడు శ్రీనివాసరావు, రాయలసీమ విద్యావంతుల వేదిక కో కన్వీనర్ విజయభాస్కర రెడ్డి, జనవిజ్ఞాన వేదిక బాధ్యుడు శేఖర్, డీటీఎఫ్ నా యకుడు రత్నం ఏసేపు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

బాకులు చూపి కారుతో ఉడాయింపు?

నంద్యాల క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణ శివారులోని ఆటోనగర్‌లో కారు విక్రయించడానికి వచ్చిన వ్యక్తులకు కొందరు పిడిబాకులు చూపి బెదిరించి కారుతో పరారైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. తెలంగాణ రాష్ట్రంలోని నారాయణపేటకు చెందిన వెంకటేష్ రెడ్డి అనే వ్యక్తి తన కారును విక్రయించేందుకు దళారి రాఘవేంద్ర, హనుమంతు ఇద్దరిని నంద్యాలకు పంపారు. నంద్యాల ఆటోనగర్‌లో హనుమంతుతో బేరం చేస్తున్నట్లు నటించిన కొందరు కారుతో ఉడాయించారు. జరిగిన ఘటనను బాధితులు కారు యజమాని వెంకటేష్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. గురువారం వెంకటేష్ రెడ్డి నంద్యాలకు వచ్చి జరిగిన ఘటనపై తాలుకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ ఘటనపై నంద్యాల తాలుకా అర్బన్ సీఐ ఈశ్వరయ్యను ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు. డీఎస్పీ ఆల్ఫ్రెన్స్‌ను అడగగా తన దృష్టికి రాలేదని, విచారణ చేస్తామని చెప్పారు.

నేతాజీకి ఘన నివాళి


నంద్యాలలో నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు


నంద్యాలలో నివాళి అర్పిస్తున్న గెలివి సహదేవుడు, రామకృష్ణారెడ్డి


పాణ్యంలో..


పగిడ్యాలలో..

నంద్యాల కల్చరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని గురువారం నంద్యాలలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళి అర్పించారు. నంద్యాల పట్టణ అధ్యక్షుడు ఇనుగూరి రమేష్‌బాబు, రేగడి లక్ష్మిరెడ్డి, కొట్టె చంద్రశేఖర్, జిల్లా నాయకులు స్వామిరెడ్డి, ఉపేంద్రనాథ్ రెడ్డి, గోస్పాడు మండల అధ్యక్షుడు మధుబాబు, బాలముని తదితర నాయకులు పాల్గొన్నారు.

నంద్యాల: స్వాతంత్ర్య పోరాట యోధుడు సుభాష్ చంద్రబోస్ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూరన సారస్వత సంఘం అధ్యక్షుడు, ప్రముఖ వైద్యుడు గెలివి సహదేవుడు అన్నారు. సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా గురువారం నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ అటానమస్ కళాశాలలో కార్యక్రమం నిర్వహించారు. ఆ విద్యా సంస్థల చైర్మన్ డా.రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డా.గెలివి సహదేవుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రిన్సిపాల్ సుబ్బయ్య, డా.లలితాసరస్వతి, అధ్యాపకబృందం పాల్గొన్నారు.

పాణ్యం: పాణ్యం టి.చంద్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీవీ రామన్, వైస్ ప్రిన్సిపాల్ పరీదా, నరేష్, శోభారాణి, జాషువా, రమేష్, వేణు, ఎన్ఎస్‌యూఐ నాయకులు ప్రతాప్, రాజు, వేణు, శ్రీరామ్, విఘ్నేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పగిడ్యాల: పగిడ్యాల ఎమార్సీ భవనంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఎంఈవో సుభాన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఎంఈవో-2 మురళీమోహన్‌రెడ్డి, పీతాంబరరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుకాణ యజమానులకు నోటీసులు

పాములపాడు జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పాములపాడు బస్టాండులో రోడ్డు కిరువైపులా రోడ్లను ఆక్రమించిన దుకాణాల యజమానులకు ఎంపీడీవో చంద్రశేఖర్, ఈవోఆర్డీ, పంచాయతీ కార్యదర్శి నోటీసులు అందించారు. గురువారం వారు మాట్లాడుతూ దుకాణ యజమానులు స్వచ్ఛందంగా రోడ్డు కిరువైపులా తమ దుకాణాలను తొలగించి సహకరించాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'సమస్యలు పరిష్కరించాలి'


ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న ఇసుక ట్రాక్టర్ల యజమానులు

నందికొట్కూరు రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు డివిజన్ పరిధిలో ఇసుక సమస్యలను పరిష్కరించాలని నందికొట్కూరు ఇసుక ట్రాక్టర్ల యజమానులు, వర్కర్లు కోరారు. మండలంలోని అల్లూరు గ్రామంలోని మాండ్ర నివాసంలో ఎమ్మెల్యే జయసూర్యకు గురువారం వినతి పత్రం అందజేశారు. యజమానులు, వర్కర్లు మాట్లాడుతూ నందికొట్కూరులో ఏర్పాటు చేసిన డంప్ నుంచి ఇసుకను ట్రాక్టర్లకు వేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ నందికొట్కూరులో ఏర్పాటు చేసిన ఇసుక డంప్ నుంచి ఇసుకను తీసుకెళ్లడానికి టన్నుల ప్రకారం ధర నిర్ణయించిన ప్రకారం తీసుకెళ్లాలని చెప్పారు. ధరలో తేడా ఉంటే అది దూరాన్ని బట్టి ఇసుకను తీసుకుని వచ్చిన ట్రావెలింగ్ చార్జీలతో కలిసి ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం ఎలాంటి అభ్యంతరాలు లేకుండా అన్నివిధాలుగా పేదలకు ఇసుకును సరసంగా చేర్చే విధంగా నిర్ణయం తీసుకుందని, దానికి అందరూ కట్టుబడి ఉండాలని అన్నారు. అలాకాకుండా ఎక్కడి నుంచో ఇసుక తెచ్చామని ఇక్కడ ధరలు ఎక్కువగా పెట్టి ఇష్టం వచ్చినట్లు అమ్మి పేదలను కష్టపెడితే చూస్తూ ఊరుకోబోమన్నారు.

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన

నంద్యాల క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా గురువారం నంద్యాల జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధుల్లో పాఠశాలలు, కళాశాలల్లో సంబంధిత పోలీస్ అధికారులు, సిబ్బంది సహాయంతో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ ప్రతి ఏటా చాలామంది వాహనదారులు రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారన్నారు. హెల్మెట్ ధరించకపోవడం, ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడంతో ప్రమాదాల బారినపడుతున్నారని అన్నారు. అనంతరం సైబర్ క్రైం నేరాలపై మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులనుంచి వచ్చే లింక్‌లపై క్లిక్ చేయవద్దన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని, ఓటీపీలను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు.

ఆత్మకూరు(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకం వల్ల శ్రేయస్కరమని ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెల్మెట్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఆత్మకూరు అర్బన్ సీఐ రాము, పాఠశాల హెచ్‌ఎం నాగరాజు ఉన్నారు.

'స్వచ్ఛ శ్రీశైలం' అందరి నినాదం కావాలి: ఈవో

శ్రీశైలం(ఆత్మకూరు), జనవరి 23(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ శ్రీశైలం అందరి నినాదం కావాలని అలాంటప్పుడే స్వచ్ఛ శ్రీశైలం లక్ష్యాన్ని సాధించవచ్చునని దేవస్థానం ఈవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం స్వచ్ఛ సేవా కార్యక్రమంలో భాగంగా క్షేత్రంలోని గంగాధర మండపం నుంచి నంది సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పలు చోట్ల స్వచ్ఛ సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ.. స్వచ్ఛ శ్రీశైలం లక్ష్యంలో భాగంగా ప్రతి గురువారం స్వచ్ఛ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దేవస్థానం డిప్యూటీ ఈవో రమణమ్మ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నరసింహారెడ్డి, పీఆర్వో అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పాణ్యం విద్యార్థుల ప్రతిభ

పాణ్యం, జనవరి23 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలో జరుగుతున్న నంది బాలోత్సవాలలో భాగంగా నిర్వహించిన చిత్రకళా, సైన్స్ పోటీలలో పాణ్యం మోడల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ఉపాధ్యాయురాలు పర్హానా తెలిపారు. గురువారం నిర్వహించిన చిత్రకళా పోటీలలో విద్యార్థి లిఖిత్ ద్వితీయ స్థానం, సైన్స్ పోటీలలో విద్యార్థి నిఖిల్ ప్రథమ స్థానం సాధించారని చెప్పారు. డీఈవో జనార్దనరెడ్డి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నంది బాలోత్సవ్ కార్యదర్శి రామరాజు, అడ్వకేట్ శంకరయ్య, కోఆర్డినేటర్లు రాఘవ, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

రహదారి పరిశీలన

పాణ్యం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తమ్మరాజుపల్లె సమీపంలో అడ్డవాగులో అడ్డంగా రహదారి నిర్మించడంతో ఎంఐ ఏఈ నాగన్న రహదారిని పరిశీలిం చారు. గురువారం ఆయన వాగుకు అడ్డంగా వేసిన రహదారిని పరిశీలించి అక్రమంగా వేసిన రహ దారిపై చర్యలు చేపడతామన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా రహదారి నిర్మించడంతో స్థానిక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నట్లు ఫిర్యాదు చేశారన్నారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని మృతదేహం

నంద్యాల క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నంద్యాల రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైనట్లు రైల్వే ఎస్ఐ జలీల్‌బాషా గురువారం తెలిపారు. మరణించిన వృద్ధుడికి సుమారు 60 ఏళ్ల ఉంటాయని, ఎత్తు 5.6 అడుగులు, చామనఛాయ రంగు కలిగి ఉన్నారని, 5 ఇంచుల మేర తెల్లని జుట్టు, గడ్డంతో ఉన్నారు. ఒంటిపై కాషాయం కలర్‌ఫుల్ హ్యాండ్స్ జుబ్బా, లైట్ తెల్లని, బ్లూ కలర్ గల్లా పట్టీలతో ఉన్న కాటన్ లుంగీ ధరించి ఉన్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. సాధువు రూపంలో ఉన్న వృద్ధుడు గురువారం ఉదయం 7.30గంటలకు మునుపు ప్రాంతంలో నంద్యాల రైల్వే స్టేషన్‌లో నందిపల్లి రైల్వే స్టేషన్ వైపు ప్లాట్‌ఫాం నెంబర్ 2లో మృతి చెంది ఉన్నారని తెలిపారు. మృతదేహంవద్ద ఎలాంటి ఆధారాలు లభించ లేదని, ఇతడి పేరు, ఊరు, ఇతర వివరాలేవీ లభ్యం కాలేదని తెలిపారు. మృతదేహాన్ని గుర్తుపట్టిన వారు, మృతుడి ఆచూకీ తెలిసినవారు 9490081633, 9440627653 నెంబర్లను సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

మహిళా కౌలు రైతుకు 'జైవిక్ ఇండియా' అవార్డు


కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న లత

నంద్యాల కల్చరల్/పాణ్యం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెద్ద ఎత్తున ప్రకృతి సాగు, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించిన బనగానపల్లి మండలం ఎనకండ్ల గ్రామానికి చెందిన సి.లతకు జైవిక్ ఇండియా అవార్డు దక్కింది. జిల్లా రైతు సాధికారత సంస్థ 2024 సంవత్సరానికి ఐదవ జైవిక్ ఇండియా అవార్డ్సులో నామినేట్ అయిన వారిలో ఉత్తమ మహిళా కౌలు రైతు వ్యాపారవేత్తగా గుర్తించి ఈనెల 22వ తేదీన బెంగళూరులో అవార్డును ప్రదానం చేశారు. అవార్డుతో పాటు రూ.50వేల నగదు బహుమతి కూడా అందుకున్నారు. ఇందుకు సంబంధించిన జైవిక్ అవార్డు సర్టిఫికెట్‌ను గురువారం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ రాజకుమారి చేతుల మీదుగా అందుకున్నారు. మహిళా కౌలు రైతు లత మాట్లాడుతూ ఈ నగదు మొత్తాన్ని ప్రకృతి వ్యవసాయం కోసం వినియోగిస్తామని తెలిపారు. గత ఆరేళ్ల నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నానని ఆమె తెలిపారు. ఒకటిన్నర ఎకరాలో ఎగ్రేడ్ వరి, అర్ధ ఎకరాలో కూరగాయల పంటలు వేస్తున్నానని తెలిపారు. వ్యవసాయాధికారులు నరేంద్రకుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'పొలాలకు రోడ్లు వేయాలి'


నందికొట్కూరు వద్ద జాతీయ రహదారిపై బైఠాయించిన రైతులు

నందికొట్కూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పంట పొలాలకు వెళ్లడానికి రోడ్లు వేయాలని రైతులు డిమాండ్ చేశారు. గురువారం నందికొట్కూరు నుంచి వీపనగండ్ల గ్రామ పొలిమేర లోని పంట పొలాలకు వెళ్లేందుకు రోడ్డు మార్గం లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో రైతులు 340-సి జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహులు మాట్లాడుతూ నందికొట్కూరు పొలిమేరలో ఎకరం భూమి రూ.కోటికి పైగా పలుకుతున్న తరుణంలో కేవలం రూ.14,06,000 రైతులకు నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకొన్నారని అన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మజీద్‌మియా, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సున్నిపెంట అభివృద్ధిపై దృష్టి సారించాలి: ఎమ్మెల్యే



సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

శ్రీశైలం(ఆత్మకూరు), జనవరి 23(ఆంధ్రజ్యోతి): సున్నిపెంట అభివృద్ధిపై ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక ఏపీ జెన్‌కో కార్యాలయంలో ఇరిగేషన్, పీఆర్, రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సున్నిపెంట అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలని, ప్రత్యేకించి గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని సూచించారు. ప్రస్తుతం రూ.3.2కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు చొరవతో మరో రూ.5కోట్ల నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు కూడా రూపొందించాలని పీఆర్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా గ్రామంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సమన్వయంగా వ్యవహరించాలన్నారు. వేసవిలో సున్నిపెంటలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. టీడీపీ నాయకులు వై.యుగంధర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో సుబ్రమణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఉమాకాంత్‌రెడ్డి, ఏఈ పక్కీరయ్య, ఇరిగేషన్ డీఈ మోహన్, ఏఈలు చిట్టిబాబు, తంగరాజు, ఎలక్ట్రికల్ ఏఈ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్ల ప్రారంభం: సున్నిపెంటలో పల్లె పండుగలో భాగంగా ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ.3.2కోట్లతో నూతనంగా నిర్మించిన పలు సీసీ రోడ్లను గురువారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ప్రారంభించారు. వెస్ట్రన్ కాలనీ, పెద్దమసీద్, స్టోర్ సెంటర్, ముస్లిం శ్మశానంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు.

వాణాలలో చోరీ

పాములపాడు జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వాణాల గ్రామంలోని రెండిళ్లలో చోరీనట్లు ఎస్ఐ సురేశ్‌కుమార్ తెలిపారు. చంద్రకళ లనే మహిళ తన భర్తకు ఆరోగ్యం సరిగా లేక పోవడంతో ఈ నెల 19న వైద్యశాలకు చికిత్స నిమిత్తం వెళ్లారు. అయితే 22న అదే గ్రామానికి చెందిన వ్యక్తులు మీ ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయని తెలపడంతో ఇంటికి వచ్చి చూడగా బీరువా తాళాలు పగులగొట్టి ఉన్నాయని, అందులోని 36 తులాల వెండి, రెండు జతల వెండి కడియాలు దొంగిలించారని తెలిపారు. అలాగే వీరి ఇంటి పక్కన గల నాగలక్ష్మమ్మ ఇంట్లో రెండు తులాల బంగారు చైన్, రూ.20 వేల నగదు అపహరించారని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అభివృద్ధి పనులకు మంత్రి భూమి పూజ


పనులను ప్రారంభిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల కల్చరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 8,17,18,19,21,22,32,33,42 వార్డులలో నూతన సీసీ రోడ్లుకు, డ్రైనేజీ కాలువలకు, మున్సిపాలిటీ వాటర్ పైపులైన్లకు న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ గురువారం భూమి పూజచేసి పనులు ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ గత వైసీపీ పాలనలలో రోడ్లు, కాలువలు, మంచినీటి వసతి లేక ప్రజలు చాలా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారన్నారు. టీడీపీ నాయకులు ఎన్ఎండీ ఫయాజ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, కమిషనర్ నిరంజన్‌రెడ్డి, కౌన్సిలర్స్, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం

నంద్యాలలోని 19వ వార్డు పొన్నాపురం కాలనీలో ఇంచార్జి షేక్ మున్నా ఆధర్యంలో టీడీపీ కార్యాలయాన్ని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ప్రారంభించారు. టీడీపీ 19వ వార్డు నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

'కొలను భారతి ఆలయాభివృద్ధికి ప్రతిపాదనలు'

కొత్తపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నల్లమల్లలో కొలువైన కొలనుభారతి సరస్వతి అమ్మవారి ఆలయాభివృద్ధికి రూ.1.20 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో రామలింగారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆలయానికి చెందిన మూలధనం నుంచి రూ.20 లక్షలు వెచ్చించి సీజీఎఫ్ కామన్‌గుడ్ ఫండ్ కింద దేవదాయశాఖకు జమ చేసినట్లు చెప్పారు. నిధులు మంజూరైన వెంటనే టెండర్లు పిలిచి ఆలయం గర్భగుడి ముందు భాగంలో గ్రానైట్స్, ధ్వజ స్తంభాలు, గోపురం చుట్టూ దేవతామూర్తుల విగ్రహాలు, ఆర్సీ, క్యూలైన్లు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

ఆత్మకూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో గురువారం మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి నేతృత్వంలో తనిఖీలు నిర్వహించారు. ప్రత్యేకించి పట్టణంలోని శివ, కార్తీక్ ట్రేడర్స్‌లలోని రూ.3.81లక్షల విలువ బయో ఉత్పత్తులకు సంబంధించిన సరైన పత్రాలు చూపకపోవడం వల్ల వాటి అమ్మకాలను నిలుపుదల చేశారు. అదేవిధంగా ఆయా దుకాణాల స్టాక్ రిజిస్టర్లను, బిల్లుల బుక్కులను పరిశీలించారు.

'అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలి'

ఆత్మకూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణ శివార్లలో కర్నూలు-గుంటూరు బైపాస్ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా సిద్దేపల్లి రస్తాలో అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సీపీఎం నాయకులు ఏసురత్నం, రణధీర్, వెంకటేశ్వర్లు, స్వాములు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం వారు సిద్దేపల్లి రస్తాను పరిశీలించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు గంగాధర్‌రెడ్డి, శివారెడ్డి, మహేష్, వెంకటరాముడు ఉన్నారు.

'ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోండి'

ఆత్మకూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో సర్వీసు ప్రొవైడర్లకు అందిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా, మెప్మా కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సర్వీసు ప్రొవైడర్లకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆత్మకూరులో నివశిస్తున్న పురుషులు, మహిళలకు బ్యూటీషియన్, ప్లంబింగ్, కార్పెంటరీ, ఎలక్ట్రికల్ వర్క్స్, ఏసీ మెకానిక్ వర్క్స్, టీవీ, రిఫ్రిజిరేటర్లు రిపేరీ, వాటర్ ప్యూరీఫయర్, గీజర్, వాషింగ్ మిషన్ సర్వీసు తదితర వృత్తి కోర్సుల్లో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. సీవో సుబ్బయ్య ఉన్నారు.

మహానందిలో పూజలు

మహానంది, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో ఇన్‌కమ్ టాక్స్ అడిషనల్ కమిషనర్ శ్రీకాంత్ గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ముఖద్వారం వద్ద ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి,అమ్మవార్లకు అభిషేకార్చన పూజలను భక్తి శ్రద్ధలతో జరిపారు. పర్యవేక్షకుడు శశిధర్ రెడ్డి శాలువాతో సన్మానించారు. ఐఆర్ఎస్ మంజూందర్ పాల్గొన్నారు.

అవకతవకలపై విచారణ

నంద్యాల రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులలో అవకతవకలు జరిగాయంటూ గ్రామస్థులు కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్వామా ఏపీడీ బాలాజి నాయక్ విచారణ చేపట్టారు. గురువారం కానాలలో ఆయన విచారణ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన 42 మంది వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ తదితర విభాగాలల్లో పనిచేస్తూ ఉపాధిలో వేతనాలు పొందుతున్నారని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామన్నారు. 18 మందిని విచారించగా గ్రామ పంచాయతీలో పనిచేసే గ్రీన్‌అంబాసిడర్స్, ఆశావర్కర్, బ్యాంక్ ఉద్యోగితో పాటు, ఒక విద్యార్థి సైతం ఉపాదిలో పాల్గొని వేతనాలు పొందుతున్నట్లు తెలిసిందన్నారు.

'జయప్రదం చేయాలి'

ఆత్మకూరు రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాదులో మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో నిర్వహించనున్న లక్ష డప్పుల మోత, వేల గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ జాతీయ నాయకులు చిలుక రాబిన్‌సన్ మాదిగ, జిల్లా అధికార ప్రతినిధి భాషపోగుల దరగయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ముఖ్యనాయకులతో గురువారంసమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు వెంకట సుబ్బయ్య, బుజ్జి, దేవసహాయం, శివకుమార్, వెంకటరమణ, రామారావు, పుల్లయ్య, వరదరాజు, శ్యాం, నాగేశేషులు, మోహన్, రంగస్వామి పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలు



సున్నిపెంట, అల్లూరులో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు

ఆత్మకూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మండలంలోని సున్నిపెంట గ్రామంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మానవ వనరుల, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఏపీ జెన్‌కో గెస్ట్‌హౌస్‌లో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనునిత్యం రాష్ట్ర ప్రగతిని కాంక్షించడంతో పాటు కార్యకర్తల సంక్షేమానికి మంత్రి లోకేశ్ చేస్తున్న కృషి హర్షణీయమన్నారు. కేసీ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి, టీడీపీ నాయకులు వై.యుగంధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నందికొట్కూరు రూరల్: అల్లూరు గ్రామంలోని మాండ్ర నివాసంలో మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను గురువారం ఎమ్మెల్యే జయసూర్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. మందులను పాడి పశువుల రైతులకు ఉచితంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు, పాడి రైతుల అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలర్ జాకీర్, టీడీపీ సీనియర్ నాయకులు మాండ్ర లింగారెడ్డి, మాండ్ర సురేంద్రనాథరెడ్డి, సర్పంచ్ చిన్న నాగలక్ష్మయ్య, మాజీ ఎంపీపీ వీరం ప్రసాదరెడ్డి, మండల కన్వీనర్లు కాతా రమేష్ రెడ్డి, పలుచాని మహేశ్వర రెడ్డి, భాస్కరెడ్డి, ముర్తుజావళి తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: పట్టణంలోని బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నివాసంలో టీడీపీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి డా.కాకరవాడ చిన్న వెంకటస్వామి ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, కౌన్సిలర్ చాంద్‌బాషా, బంగారు వెంకటేశ్వర్లు, గుణశేఖర్‌రెడ్డి, డా.కరీం, మల్యాల బషీర్, జనార్దన్‌గౌడ్ పాల్గొన్నారు.

● పట్టణంలోని వృద్ధాశ్రమంలో శ్రీ చౌడేశ్వరి దేవి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు, కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు ముర్తుజావళి, దేశెట్టి శ్రీనివాసులు, టీడీపీ నాయకురాలు డా.వనజ తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: పాములపాడులో మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. తెలుగు యువత మండల అధ్యక్షుడు మధుకృష్ణ, ఉస్మాన్, మహేశ్వరరావు, రమేశ్, సత్తి, రమణ, శహీన్, శివ, శ్రీదర్, అబ్బు, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగా: మండలంలోని వివిధ గ్రామాల్లో టీడీపీ యువనేత, మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. పోతులపాడు గ్రామంలో సర్పంచ్ నిర్మలమ్మ, శివానందరెడ్డి కేకు కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు.

నంద్యాల రూరల్: అయ్యలూరు గ్రామంలో మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. టీడీపీ నాయకులు బైరెడ్డి శంకరమ్మ, ఈశ్వరరెడ్డి, పరమేశ్వరరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, రామిరెడ్డి, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.


పోతులపాడు గ్రామంలో..


అయ్యలూరులో..


పాములపాడులో..


నందికొట్కూరులో..

ఘనంగా గౌస్‌ముని ఉరుసు



ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

డోన్ రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చనుగొండ్ల గ్రామంలో గౌస్‌ముని స్వామి ఉరుసు గురువారం ఘనంగా ప్రారంభమైంది. గౌస్‌ముని ఉరుసు మహోత్సవాల సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల్లో డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ యువ నాయకులు ధర్మవరం మన్నె గౌతమ్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలలను పనుల్లో పెట్టుకోవద్దు

డోన్ రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బాలలను పనుల్లో పెట్టుకోవద్దని డోన్ సహాయ కార్మిక అధికారి నీలిమా సంధ్య, అసిస్టెంట్ ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరెడ్డి, జూనియర్ కళాశాలల సంక్షేమ హాస్టళ్ల వార్డెన్ అమర్నాథ్ రెడ్డిలు అన్నారు. గురువారం పట్టణంలోని మెకానిక్ షాపులు, హోటళ్ల వద్ద చైల్డ్ లేబర్స్ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి 31వ తేదీ వరకు చైల్డ్ లేబర్స్ స్పెషల్ డ్రైవ్ ఉంటుందని తెలిపారు. 18 సంవత్సరాలలోపు బాలురను పనుల్లో పెట్టుకుంటే రెండేళ్ల జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా ఉంటుందన్నారు. ఎక్కడైనా పనుల్లో బాలురు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పిల్లల ప్రవర్తనను గమనించాలి

శిరివెళ్ల, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : పిల్లల చదువుతో పాటు వారి ప్రవర్తనను తల్లిదండ్రులు తరచూ గమనిస్తూ ఉండాలని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇంద్రావతి సూచించారు. కళాశాలలో గురువారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఆధునిక యుగంలో పిల్లల్ని పెంచడం కష్ట సాధ్యమైందని, యుక్త వయసులో ఉన్న పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సెల్ ఫోన్, చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

లారీ వర్కర్స్ యూనియన్ నాయకుడి మృతి

బేతంచెర్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల లారీ వర్కర్స్ యూనియన్ డ్రైవర్ కమిటీ సభ్యులు, సీపీఎం సభ్యులు మాదన్న గురువారం మృతి చెందాడు. ఈ నెల 19న తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న లారీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ఎల్లయ్యలు మృతుని భౌతిక కాయానికి పూలమాలలు వేసి పరామర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. మట్టి ఖర్చులకు రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని ఆయన భార్య వెంకటేశ్వరమ్మకు అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, రాజు,రమణారెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, దనుంజయుడు, సురేష్ తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా కుష్టు వ్యాధి సర్వే నిర్వహించండి

చాగలమర్రి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కుష్టువ్యాధి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని వైద్యశాఖ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి అన్నారు. గురువారం చాగలమర్రి 12, 13 టీమ్‌లు నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 2వ తేదీ వరకు చేపట్టనున్న కుష్టువ్యాధి సర్వేను ఇంటింటికి వెళ్లి నిర్వహించాలని అన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించాలని కోరారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి చికిత్స నిమిత్తం వారిని వైద్యశాలకు పంపించాలని తెలిపారు. వారికి వైద్య చికిత్సలు అందించి వ్యాధి లక్షణాలు ఉన్నట్లైతే ప్రత్యేక దృష్టి ఉంచుతామని అన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ శివలక్ష్మి, వలంటీర్లు ఉన్నారు.

పశువుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పశువులకు వచ్చే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ ఏడీ వరప్రసాద్ అన్నారు. గురువారం గొడిగనూరు, పెద్దవంగలి గ్రామాల్లో పశు వైద్య శిబిరాలను నిర్వహించారు. గొడిగనూరు గ్రామంలో టీడీపీ నాయకులు శేఖర్‌రెడ్డి రైతులకు మందులు పంపిణీ చేశారు. అనంతరం గొర్రెలు, మేకలు, ఎద్దులు, గేదెలకు, ఏడీ ఆధ్వర్యంలో వైద్య చికిత్సలు చేసి వివిధ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్యులు సాయిబాబా, దీపకుమారి, బీఎల్‌వోలు జమాల్‌వలి, మురళీమోహన్, గోపాలమిత్ర వీరయ్య పాల్గొన్నారు.

సాయిబాబాకు క్షీరాభిషేకం

చాగలమర్రి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలోని సాయినాథ మందిరంలో గురువారం వేద పండితుడు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో సాయిబాబాకు క్షీరాభిషేకం, రుద్రాభిషేకం, ప్రత్యేక హారతులు చేశారు. సాయిబాబా పల్లకితో ఊరేగింపు చేశారు. మహిళలు సామూహికంగా సాయివ్రతం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యత అందరి బాధ్యత

చాగలమర్రి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ అక్షరాస్యత అందరి బాధ్యతని వయోజన విద్య జిల్లా సూపర్‌వైజర్ ఫయాజ్, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం చాగలమర్రిలో ఉల్లాస్ కార్యక్రమం కింద వీసీలకు శిక్షణ ఇచ్చారు. విద్యాబోదనకు సంబంధించిన 950 పాఠ్యపుస్తకాలు, రిజిస్ట్రర్లు అందజేశారు. వయోజనులకు విద్యాబోధన చేసి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని అన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం నాగమ్మ, వెలుగు సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

టీడీపీకి అంబేడ్కర్ స్ఫూర్తి

ఆయన విగ్రహం ఆవిష్కరించడం నా అదృష్టం: మంత్రి బీసీ జనార్దనరెడ్డి



ఆసుపత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన రెడ్డి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బీసీ జనార్దన రెడ్డి

కోవెలకుంట్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): భారతరత్నం బాబాసాహెబ్ అంబేడ్కర్ స్ఫూర్తితో బడుగు బలహీన వర్గాలకు రాజ్యాంగబద్ధ పదవుల్లో స్థానం కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీకి దక్కుతుందని మంత్రి బీసీ జనార్దనరెడ్డి అన్నారు. నంద్యాల జిల్లా కోవెలకుంట్ల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు రోడ్డు ప్రధాన రహదారిలోని జమ్మలమడుగు సర్కిల్ వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు ఆమోదమైన రాజ్యాంగాన్ని అందించిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని అన్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు దళితులకు పెద్ద పీట వేసిందని అన్నారు. ముఖ్యంగా లోక్‌సభ స్పీకరుగా జీఎంసీ బాలయోగి, శాసనసభ స్పీకరుగా దళిత మహిళ ప్రతిభా భారతికి అవకాశం కల్పించిందని అన్నారు. నేడు రాష్ట్ర హోంమంత్రిగా దళిత మహిళకు అవకాశం కల్పించిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందని తెలిపారు.

● బీఆర్ అంబేడ్కర్ విగ్రహం అనంతరం మంత్రి బస్టాండు వరకు పాదయాత్రగా వెళ్లి బస్టాండు సమీపంలో మాజీ సైనికులు అందరూ కలిసి ఏర్పాటు చేసిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. యువత నేతాజీని ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గడ్డం నాగేశ్వర్‌రెడ్డి, బీవీ ప్రసాదరెడ్డి, పొట్టిపాటి సుబ్బారెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, అంబేడ్కర్ విగ్రహ దాత డాక్టర్ రామిరెడ్డి, మైనార్టీ నాయకులు ఎస్ఏ గఫూర్, ధనుంజయుడు, బిజినవేముల హుసేనయ్య, వల్లంపాడు సర్పంచ్ గార్లపాటి జగదీశ్వర రెడ్డి, చిన్నకొప్పెర్ల బుచ్చన్న, సౌదరిదిన్నె సుబ్బారెడ్డి, అమడాల మద్దిలేటి, సర్పంచ్ మెట్ల సరళ, పెనుగొండ రాజశేఖర్ పాల్గొన్నారు.

● ప్రభుత్వ ఆసుపత్రిని కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దుతా మంత్రి బీసీ జనార్దనరెడ్డి అన్నారు. గురువారం కోవెలకుంట్ల ఆసుపత్రిలో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆసుపత్రిలోని ప్రతి వార్డును పరిశీలించి అక్కడి సమస్యలపై డాక్టర్ చంద్రశేఖర్, రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీసీ మాట్లాడుతూ 50 పడకల ఆసుపత్రిగా మార్చుతామని చెప్పారు. కార్యక్రమంలో డెవలప్‌మెంటు కమిటీ సభ్యులు గడ్డం నాగేశ్ రెడ్డి, డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి, ఎస్ఏ గఫూర్, ఎంపీడీవో వరప్రసాదరావు, ఈవోఆర్డీ ప్రకాశ్‌నాయుడు, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దారు పవన్‌కుమార్ రెడ్డి, వైద్యులు, ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్, సీఐ హనుమంత నాయక్, ఎస్ఐలు మల్లిఖార్జునరెడ్డి, భూపాలుడు, రమణయ్య పాల్గొన్నారు.

దేశభక్తికి నిలువెత్తు రూపం నేతాజీ



ఆళ్లగడ్డలో నేతాజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అమీర్ బాషా, ఎస్ఐ నగీనా



బేతంచెర్లలో నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 23(ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ దేశభక్తికి నిలువెత్తు రూపమని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు అమీర్ బాషా, పట్టణ ఎస్ఐ నగీనా అన్నారు. పడకండ్లలోని కేపీజీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో నేతాజి 128వ జయంతి సందర్భంగా ఆయన చితప్రటానికి పూలమాలలు వేసి గురువారం నివాళి అర్పించారు. హెచ్ఎం రఫి, మధుశాస్త్రి, శుభాదేవి, కల్యాణి పాల్గొన్నారు.

● ఆళ్లగడ్డలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గంగన్న ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను నిర్వహించారు. అధ్యాపకులు సుధారాణి, విజయలక్ష్మి, నాగమస్తాన్, జయచంద్ర పాల్గొన్నారు.

● **బేతంచెర్ల:** సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ కుమార్ మండల నాయకులు శ్రీకర్, కిషోర్, సురేష్, హుశేన్, పవన్, మధు, హనుమతేజ వెంకి ప్రశాంత్, సురేష్, మహేష్‌లు హాజరై నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

● **చాగలమర్రి:** చాగలమర్రి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు గురువారం హెచ్ఎం శాస్త్రీ ఆధ్వర్యంలో నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీడీ దాదాపీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **ప్యాపిలి:** పట్టణంలోని శ్రీసరస్వతి శిశు మందిరంలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రధానాచార్యులు రామాంజినేయులు, వాసు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

● **అవుకు:** పట్టణంలోని మదర్‌మోడల్ హైస్కూల్‌లో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా గురువారం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు నేతాజీ చిత్రపటానికి పూలుమాలలు వేసి నివాళులర్పించారు. నేతాజీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రామసుబ్బమ్మ, ప్రిన్సిపాల్ ప్రమీల, హెచ్ఎం మురళీమోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **కోవెలకుంట్ల:** ఏపీ ఉపాధ్యాయ సంఘం, కోవెలకుంట్ల మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నేతాజీ జయంతి వేడుకలు జరిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.రాజయ్య నేతాజీ చిత్రాపటానికి పూలమాల వేసి నివాలులర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఆర్థిక కార్యదర్శి శ్రీపతి, పాఠశాల ఉపాధ్యాయులు నాగేశుడు, మల్లికార్జున, శ్రీనివాసులు, శ్రీనివాసరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, తిరుపతిరెడ్డి, సురేశ్‌రెడ్డి, సుధీర్, వెంకటరమేశ్, సుధాకర్‌రెడ్డి, మహిళా ఉపాధ్యాయినులు జహిరాబి, శైలజ పాల్గొన్నారు.

● **రుద్రవరం:** ఆదర్శ పాఠశాలలో సుభాస్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ నేతాజి గొప్ప దేశభక్తుడని అన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా కరీముల్లా

కొలిమిగుండ్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్ల మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా కరీముల్లా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా విధులు నిర్వహిస్తున్న సాయిక్రిష్ణ బనగానపల్లెకు బదిలీ కాగా ఆయన స్థానంలో కరీముల్లాను ఉన్నతాధికారులు ఇక్కడికి బదిలీ చేశారు. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. మండలంలో తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించనున్నటు పేర్కొన్నారు.

సర్వేలను పూర్తి చేయాలి

కొలిమిగుండ్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ శాఖలకు సంబంధించిన సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించినట్లు ఎంపీడీవో ప్రసాదరెడ్డి అన్నారు. గురువారం సచివాలయం-2లో జరిగిన జిల్లా కలెక్టర్ సచివాలయ జూమ్ మీటింగ్‌కు ఆయన హాజరయ్యారు. ఆయా శాఖలు నిర్వహిస్తున్న సర్వేల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.2.5 లక్షల జరిమానా

కొలిమిగుండ్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నెల్లూరు-ముంబై హైవేతో పాటు, అనంతపూర్-అమరావతి 544డి జాతీయ రహదారిలో నంద్యాల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్ నాయక్ గురువారం వాహనాలపై విస్తృత దాడులు నిర్వహించారు. అధిక టన్నేజీతో వెళుతున్న లారీలు, టిప్పర్లు తదితర వాహనాలు, సరైన పత్రాలు లేని పలు వాహనాలను గుర్తించి రూ.2.5 లక్షలు జరిమానా విధించనున్నట్లు తెలిపారు. సిబ్బంది పవన్‌కు మార్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా ఆరాధన

దొర్నిపాడు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొర్నిపాడు కోట గ్రామంలో వెలసిన ఆది అల్లూరి ఎరుకలిస్వామి ఆరాధన మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. గోపూజ, ప్రాతఃకాల పూజ, జలాభిషేకం, భగవద్గీత పారాయణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఆరాదన మహోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి కాయకర్పూరం అందించి మొక్కుబడులు తీర్చుకున్నారు.

ఆర్థిక సాయం అందజేత

చాగలమర్రి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టివీడు గ్రామంలో వీఆర్‌ఏ ఖాదర్‌బాషా (55) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ కన్వీనర్ నరసింహారెడ్డి, ఆర్ఐ అబ్దుల్‌సత్తార్, వీఆర్వో వెంకట్రామిరెడ్డి, వీఆర్ఏల సంఘ అధ్యక్షుడు అబ్దుల్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి సంతాపం ప్రకటించి సానుభూతి వ్యక్తం చేశారు. మృతుడి భార్య మహబూబీకి ప్రభుత్వం ద్వార మంజూరైన రూ.25 వేలు అందజేశారు.


రాష్ట్రాభివృద్ధిలో నారా లోకేశ్ కీలకం



ఆళ్లగడ్డలో ఎమ్మెల్యేకు కేక్ తినిపిస్తున్న ఆమె సోదరుడు జగత్ విఖ్యాత్‌రెడ్డి



రూపనగుడిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



డోన్: మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ధర్మవరం సుబ్బారెడ్డి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 23(ఆంధ్రజ్యోతి) : ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ రాష్ట్రాభివృద్ధిలో కీలకంగా వ్యవహరిస్తున్నారని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ, యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి కేక్ కట్ చేశారు. నియోజకవర్గంలోని పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డోన్ రూరల్: మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. డోన్ పట్టణం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నారా లోకేశ్ జన్మదినం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కేక్‌ను మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, టీడీపీ నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి, చిన్నకేశవయ్యగౌడు, సీలం భాస్కర్ నాయుడు, విజయభట్టు, ఓంప్రకాష్, జనసేన నాయకులు గడ్డం బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

● డోన్ పట్టణంలోని ఎంఎస్ఆర్ కార్యాలయంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జన్మదిన కేక్‌ను రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు సీఎం శ్రీనివాసులు, ప్యాపిలీ మాజీ ఎంపీపీ ఆర్ఈ రాఘవేంద్ర, టీడీపీ నాయకులు గంధం శ్రీనివాసులు, ప్యాపిలి గండికోట రామసుబ్బయ్య, అడ్వకేట్ ఆలా మల్లికార్జున రెడ్డి, టీడీపీ యువ నాయకులు మన్నె గౌతమ్ రెడ్డి వై.హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్లనాగయ్య, పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి సమక్షంలో టీడీపీ జాతీయ ప్రధాన మంత్రి నారా లోకేశ్ 42వ జన్మదిన వేడుకలు గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. బర్త్‌డే కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోలూరు రాఘవరెడ్డి, ఉన్నం చంద్రశేఖర్, పోలూరు శ్రీనివాసరెడ్డి, తిరుమలేష్ చౌదరి, సుధాకర్, బుగ్గన ప్రభాకర్ రెడ్డి, జాకీరుల్లా భేగ్, రామ్మూర్తి, మధు, రాముడు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మంత్రి నారా లోకేశ్ తెలుగుదేశం పార్టీ భవిష్యత్తు నాయకులని మండల తెలుగు యువత అధ్యక్షుడు గొంగటి హుస్సేన్‌రెడ్డి, టీడీపీ నాయకులు గూలి నాగేశ్వరరెడ్డి అన్నారు. గురువారం నారా లోకేశ్ జన్మదిన వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నంద్యాల ప్రసాదు, నిమ్మకాయల దస్తగిరి, బొట్టుస్వామి, తెలుగు యువత అధికార ప్రతినిధి విజయ్, ఎమ్మార్పీస్ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: మండలంలోని రూపనగుడి గ్రామంలో మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరుకున్నారు. గురువారం టీడీపీ మండల నాయకుడు, సాగునీటి సంఘం అధ్యక్షుడు కర్నాటి మహేశ్వరరెడ్డి కేక్‌కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో కర్నాటి శశిధర్‌రెడ్డి, మేకల రామచంద్రుడు, చిన్న పుల్లారెడ్డి, సమీర్, ఖలీల్, బాషా ఉన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి : డీఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో జనార్దన్ రెడ్డి

అవుకు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గుండ్లశింగవరం జడ్పీ ఉన్నత పాఠశాల, అవుకు పట్టణంలోని బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలు, కేజీబీవీని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం పాఠశాలల్లోని విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాసులను అందుబాటులోకి తెచ్చిందన్నారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలను సాధిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు శ్రీధర్‌రావు, వెంకటేశ్వరరెడ్డి, ప్రధానోపాధ్యాయులు శింగయ్య, చెన్నకేశ్వరి, క్యాంప్ క్లర్క్ రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో పర్యటించండి: ఆర్డీవో

బనగానపల్లె, జనవరి 23(ఆంధ్రజ్యోతి): వీఆర్‌వోలు, గ్రామ సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి రీసర్వేలోను, గ్రామ సభల్లోను వచ్చిన దరఖాస్తులకు పరిష్కారం చూపాలని డోన్ ఆర్డీవో నరసింహులు అన్నారు. గురువారం బనగానపల్లె తహసీల్దారు కార్యాలయంలో సర్వేయర్లు, వీఆర్‌వోలతో సమావేశం తహసీల్దారు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ రైతులు ఇచ్చిన, ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని అలన్నారు. అర్హులైన రైతులకు న్యాయం చేయాలన్నారు కార్యక్రమంలో ఆర్ఐ రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి

ప్యాపిలి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని ఎంపీపీ గోకుల్ లక్ష్మి అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో తిరిగి తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఎక్కడైనా నీటి సమస్య ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. అలాగే ఎటువంటి వ్యాధుల ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. పాఠశాలల్లో భోజన పథకాన్ని, అంగన్‌వాడీలను, రేషన్ దుకాణాలను తరచూ తనిఖీలు చేయాలన్నారు. ఎక్కడైన అక్రమాలు జరుగుతుంటే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏఈ ప్రభాకర్‌రెడ్డి, ఈవోఆర్డీ బాలక్రిష్ణుడు, ఏవో రాజేష్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

శిరివెళ్ల, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు చట్టవిరుద్ధమని సీఐ వంశీధర్ అన్నారు. మండలంలోని యర్రగుంట్ల విమల ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు పలు అంశాలపై గురువారం అవగాహన కల్పించారు. బాలికా విద్య, సైబర్ నేరాలు, మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలు వంటి వాటిపై వివరించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ చిన్న పీరయ్య, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

శిరివెళ్ల, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : యూరియా కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరకు విక్రయించినా చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి సుధాకర్ హెచ్చరించారు. మండలంలోని పలు ఎరువుల, పురుగుమందుల దుకాణాలను ఆయన గురువారం పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. దుకాణాల్లోని రిజిష్టర్లలో నమోదు చేసిన ఎరువుల వివరాలు, నిల్వలను పరిశీలించారు. రైతులకు అవసరమైన మేర యూరియా ఆర్బీకేలలో, ఎరువుల దుకాణాల్లో అందుబాటులో ఉందన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఆళ్లగడ్డ (శిరివెళ్ల), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోర్టు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. శిరివెళ్ల మండలం యర్రగుంట్ల గ్రామానికి చెందిన రాంప్రసాద్ అనే యువకుడు ఈ నెల 15న అహోబిలం పారువేట ఉత్సవానికి వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా ఆళ్లగడ్డ కోర్టు సమీపంలో మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రాంప్రసాద్‌ను మెరుగైన వైద్యం నిమిత్తం బెంగళూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అక్కడ కోలుకోలేక గురువారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలి

బనగానపల్లె, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి అన్నారు. గురువారం బనగానపల్లె మండలంలోని నందివర్గం విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తల్లిదండ్రులను ప్రేమించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం. సుబ్బరాయుడు, సుబ్బారెడ్డి, రవికుమర్, వెంకటరెడ్డి, వెంకి అమరేశ్రి, సుజాత, సుచరిత తదితరులు పాల్గొన్నారు. విద్యలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

పశువులకు సకాలంలో వైద్యమందించాలి

రుద్రవరం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పశువులకు సకాలంలో వైద్యమందించాలని పశువైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్ అన్నారు. గురువారం మండలంలోని అప్పనపల్లె, గోనంపల్లె, పందిర్లపల్లె, కొండమాయపల్లె, వెలగలపల్లె, ఆర్.కొత్తూరు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. 187 లేగదూడలకు, 225 పశువులకు, 1280 గొర్రెలు, మేకలకు మందులు ఇచ్చామని ఆయన అన్నారు.

రైతులకు శిక్షణ

రుద్రవరం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఏవో నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. గురువారం మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ నిర్వహించారు. మొక్కజొన్నను ఆశించే కత్తెర పురుగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో రాజు, వీఏఏ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరులో పార్వేట పల్లకి ఉత్సవం

రుద్రవరం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆలమూరు గ్రామంలో పార్వేట పల్లకీ ఉత్సవంలో భాగంగా స్వామి తెలుపులు (అరుగులు)పై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. గ్రామ పెద్దలు మేళతాళా లతో ఎదురేగి స్వామి ఉత్సవ పల్లకీకి కొలువుదీరారు. అహోబిళ పుణ్య క్షేత్రం నుంచి మకర సంక్రాంతి రోజున ఉత్సవ పల్లకి ప్రారంభమైంది. పల్లకిలో ప్రహ్లాదవరద స్వామి జ్వాలా నరసింహస్వాములు కొలువు దీరారు. కార్యక్రమంలో సీఐ వంశీధర్, డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖరయ్య, కార్యదర్శి పాములేటి పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

చాగలమర్రి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలోని వాసవీ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్యాబుద్దిన్ అధ్యక్షతన రోడ్డు భద్రత మాసోత్సవాలపై అవగాహన కల్పించారు. హెడ్‌కానిస్టేబుల్ శంకర్ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి పుల్లారెడ్డి, రామశేషయ్య, ఎన్ఎస్ఎస్ అధికారి మహేశ్వరయ్య, జీఎంఎస్‌కేలు ప్రసన్న, ధరణి, పర్వీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

● **బనగానపల్లె:** యువత రోడ్డు భద్రత పాటించాలని బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బనగాన పల్లె పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. కార్యక్ర మంలో కళాశాల ప్రిన్సిపాల్ లలిత, డాక్టర్ సూర్య నారాయణరెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, సీతమ్మ, కౌసల్యదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.